TEL:T/TG/2024/0814

# మన వెలుగు

ప్రతి వార్త ప్రజల వైపు తెలుగు దినపత్రిక

MANA VELUGU TELUGU DAILY

విలేఖరులు కావలెను...

మన వెలుగు తెలుగు దినపత్రికకు
ఆంధ్రప్రదేశ్, తెలంగాణ లోని అన్ని జిల్లాల వారిగా స్టాఫ్ రిపోర్టర్లు
మరియు నియోజకవర్గ,మండలవారిగా విలేఖరులు కావలెను,
తెలుగు భాష మీద కనీస అవగాహన కలిగివుండి, వార్తలు
రాయగలిగిన వారికి ప్రాధాన్యత ఇవ్వబడును..
మరిన్ని వివరాలకు సంప్రదించండి...

నెట్ వర్క్ ఇంచార్జి సెల్ : 9533397954

పబ్లిషర్ : హైదరాబాద్ సంపుటి :01 సంచిక : 160 ఆదివారం 02-02-2025 పేజీలు :06 వేల : 05/-

# తెలంగాణకు చిల్లి గవ్వ కూడా తేలేకపోయారు

## ◆కాంగ్రెస్, బీజేపీలు ప్రజలకు క్షమాపణ చెప్పాలి

## ◆కేంద్ర బడ్జెట్‌పై బీఆర్ ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శలు



**హైదరాబాద్ (మన వెలుగు) ఫిబ్రవరి 01 :** జాతీయ పార్టీలు ఎప్పటికీ తెలంగాణ రాష్ట్ర ప్రయోజనాలను కాపాడలేవని మరోసారి కేంద్ర బడ్జెట్ తో రుజువైందని బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ఈ రెండు పార్టీల నుంచి చెరో ఎనిమిది మంది ఎంపీలను గెలిపించి పార్లమెంటుకు పంపిస్తే ఆ 16 మంది కలిసి కేంద్ర బడ్జెట్లో తెలంగాణకు తెచ్చింది అక్షరాల గుండు సున్నా అని తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. తెలంగాణ ముఖ్యమంత్రిగా రాష్ట్ర ప్రయోజనాలను కాపాడాల్సిన రేవంత్ రెడ్డి బిజెపితో చీకటి ఒప్పందాలు చేసుకోవడం వల్ల ఇవాళ ఈ పరిస్థితి దాపురించిందని మండిపడ్డారు. వరుసగా రెండో ఏడాది తెలంగాణకు చిల్లి గవ్వ కూడా తీసుకురాలేకపోయిన బిజెపికి చెందిన కేంద్ర మంత్రులు, సీఎం రేవంత్ రెడ్డి తో పాటు కాంగ్రెస్, బిజెపిలకు చెందిన ఎంపీలు తెలంగాణ సమాజానికి క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. స్వీయ రాజకీయ అస్తిత్వమైన బీఆర్ఎస్ మాత్రమే తెలంగాణ హక్కులను, జాతి ప్రయోజనాలను కాపాడగలుగుతుందని ప్రొఫెసర్ జయశంకర్ సార్ చెప్పిన మాట ఈ రోజు మరోసారి గుర్తుకు వస్తుందన్నారు. లోక్ సభలో తెలంగాణ పార్టీ అయినా బిఅర్ఎస్ కి ప్రాతినిధ్యం లేకుంటే జరిగే నష్టం ఏమిటో ప్రజల గమనిస్తున్నారన్నారు. పార్లమెంట్ లో ప్రాంతీయ పార్టీలకు బలమున్న బిహార్, అంద్రప్రదేశ్ వంటి రాష్ట్రాలకు దక్కిన ప్రాధాన్యం చూసి జాతీయ పార్టీలను గెలిపిస్తే తెలంగాణను నిండా ముంచారని ప్రజలకు అర్ధం అయిందన్నారు.రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముప్పై సార్లు ఢిల్లీకి పోయింది తెలంగాణకు నిధులు తెచ్చేందుకు కాదని, తెలంగాణ నుంచి డిల్లీకి మూటలు మోసేందుకేనని ఈ రోజు తెలిపోయిందన్నారు. కాంగ్రెస్ సీఎంగా ఉంటూ బీజేపీకి గులాంగిరీ చేస్తూన్న బడే భాయ్- చోటే భాయ్ అనుబంధంతో తెలంగాణకు నయాపైసా లాభం లేదని తేలిపోయిందన్నారు. తెలంగాణ నుంచి మరో ఎనిమిది మంది కాంగ్రెస్ ఎంపీలు గెలిచినా.. వారి వల్ల కూడా రాష్ట్రానికి దక్కింది గుండు సున్నానే అన్నారు. కేవలం ఢిల్లీ బాసులను ప్రసన్నం చేసుకునే పని తప్ప.. ఏనాడూ కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ లో తెలంగాణ గళం వినిపించిన పాపాన పోలేదన్నారు. కేంద్ర బడ్జెట్ లో తెలంగాణకు రావాల్సిన వాటా గురించి పోరాడిన దాఖలు లేకపోవడం వల్లనే తెలంగాణకు తీవ్ర అన్యాయం జరిగిందని కెటిఅర్ మండిపడ్డారు. డబుల్ ఇంజన్ సర్కార్ అంటూ, కేంద్రంలో ప్రభుత్వం ఎర్పడితే తెలంగాణకు నిధులు తేస్తామంటూ రాష్ట్రం నుంచి ఎనిమిది మంది బీజేపీ గెలిచినా, ఇద్దరు కేంద్ర మంత్రులున్నా తెలంగాణకు ఒక్క నయా పైసా తీసుకురాలేకపోయారన్నారు. ఇతర రాష్ట్రాలనుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న బీజేపీ ఎంపీలు తమ రాష్ట్రాలకు నిధుల వరద పారిస్తుంటే.. తెలంగాణ బీజేపీ ఎంపీలు, నిస్సహాయ మంత్రులు చేతకాని దద్దమ్మల్లా వ్యవహరిస్తున్నారు. తెలంగాణకు నిధులు తేలేని బిజెపి, కాంగ్రెస్ యంపిలు తెలంగాణ ప్రజలకు క్షమాపణ చెప్పాలని కెటిఅర్ డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వానికి తెలంగాణ అంటే ఎంత చిన్నచూపో మరోసారి పార్లమెంట్ సాక్షిగా ఈ బడ్జెట్ రుజువుచేసిందని కెటిఅర్ అన్నారు. గత బడ్జెట్ మాదిరిగానే ఈ సారి కూడా కనీసం తెలంగాణ అనే పదమే ఉచ్ఛరించలేదని, ఈ బడ్జెట్ లోనైనా కేంద్ర ప్రభుత్వం తెలంగాణ వైపు కన్నెత్తైనా చూస్తుందేమో అని నాలుగు కోట్ల ప్రజలు ఎదురుచూశారన్నారు. కానీ అందరి ఆశలపై కేంద్ర ప్రభుత్వం మళ్లీ నీళ్లు చల్లిందన్నారు. రానున్న ఎన్నికల కోసం బీహార్ కు బంగారుపల్లెంలో వడ్డించి.. తెలంగాణకు మాత్రం అన్యాయం చేసిందన్నారు. తెలంగాణకు ఐఐటీ, ఐఐఎం, ఐసర్, ఎన్ఐడీ, ట్రిపుల్ ఐటీ వంటి ఉన్నత విద్యాసంస్థల్లో ఏదీ ఇవ్వకపోవడం ఇక్కడి విద్యార్థులకు, యువతకు, వారి తల్లిదండ్రులకు తీవ్ర అన్యాయం చేయడమే అన్నారు. దేశ అత్యున్నత చట్టసభలో హామీ ఇచ్చిన విభజన హక్కులను కూడా కేంద్ర ప్రభుత్వం నెరవేర్చకపోవడం అత్యంత దుర్మార్గమన్నారు. బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ, ఐటీఐఆర్ పునరుద్ధరణ, సాగునీటి ప్రాజెక్టుకు జాతీయ హెూదా వంటి హామీలు ఇన్నాళ్లయినా అమలు చేయని బీజేపీని ఇకపై రాష్ట్ర ప్రజలు నమ్మరన్నారు. పక్కనున్న విశాఖ ఉక్కు కర్మాగారానికి నిధుల సహాయం అందిస్తూ తెలంగాణకు మెండి చూపించారన్నారు. కేంద్ర బడ్జెట్ లో ప్రాధాన్యతలు, కేటాయింపులు చూస్తే, కేవలం బీజేపీ పాలితరాష్ట్రాలకు పెద్దపీట వేసి, బడ్జెట్ లో ఇతర రాష్ట్రాలకు అన్యాయం చేయడం సరైన సంస్కృతి కాదన్నారు. దేశం ఖజానా నింపే దక్షిణాది రాష్ట్రాలపై కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం సమాఖ్య స్ఫూర్తికి పూర్తిగా విరుద్ధమన్నారు.

# మౌళిక వసతులు బావుంటేనే రాష్ట్ర అభివృద్ధి బాట పడుతుంది

### - మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి



**హైదరాబాద్ (మన వెలుగు) ఫిబ్రవరి 01 :** బాధ్యతలు స్వీకరించిన ప్రతీ సీఈ తమకు కేటాయించిన విభాగంలో సంపూర్ణంగా అధ్యయనం చేసి సమగ్ర రిపోర్ట్ సిద్ధం చేయాలని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఆదేశించారు. ఆర్ ‌ఒ బీలో ఐదుగురు సీఈ లకు సబ్జెక్టులు కేటాయిస్తూ జీ.ఓ. విడుదలైన నేపథ్యంలో ..ఐదుగురు సీఈలతో మంత్రి లోటస్ పాండ్ లోని తన నివాసంలో ఈ రోజు ఉదయం రివ్యూ నిర్వహించారు. ఆర్ %ఒ% బీ శాఖలోని ప్రతీ విభాగం రాష్ట్ర అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తుందని.. మీరంతా కష్టపడి పనిచేసి ప్రజలకు మెరుగైన మౌళిక వసతుల కల్పనలో చురుకైన పాత్ర పోషించాలని ఆయన సీఈ లకు దిశానిర్దేశం చేశారు.ప్రత్యేకించి హైదరాబాద్ లోని మూడు టిమ్స్, నిమ్స్, వరంగల్ సూపర్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ నిర్మాణంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని బిల్డింగ్స్ సీఈ రాజేశ్వర్ రెడ్డికి సూచించారు. అలాగే లెఫ్ట్ వింగ్ తీవ్రవాద ప్రభావితప్రాంతాల్లో రోడ్ల నిర్మాణం వేగం పుంజుకుంటే..ఆదివాసీ గిరిజనుల జీవితాలు బాగుపడతాయని సీఈ శ్రీమతి టీ జయభారతి కి తెలిపారు. రూరల్ రోడ్స్, ఎస్సీఎస్డీఎఫ్, ఎస్టీఎస్డీఎఫ్ నిధులతో నిర్మించే రోడ్లు గ్రామీణ ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పిస్తాయని.. ఈ రోడ్ల విషయంలో గత పదేండ్లు నిర్లక్ష్యం జరిగిందని.. వెంటనే సంబంధిత రోడ్లను గుర్తించడం, వాటి నిర్మాణానికి కావాల్సిన నిధులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సీఈ డి. శ్యామ్ కుమార్ ను మంత్రి ఆదేశించారు. అంతేకాదు, అడ్మిన్ సీఈ గా శ్రీమతి ఎస్. తిరుమల, మెంబర్ ఆఫ్ కమీషనరేట్ ఆఫ్ టెండర్స్ సీఈ జి. చిన్న పుల్లదాసు లు మరింత కష్టపడి పనిచేసి శాఖకు మంచి పేరు తీసుకురావాలని ఆదేశించారు.అంతేకాదు, అటవీ అనుమతులతో పెండింగ్ లో ఉన్న రహదారులపై ప్రత్యేక దృష్టి సారించాలన్న మంత్రి, పనుల్లో వేగం పెంచి ప్రగతి చూపిస్తేనే, మరిన్ని నిధులు సాధించవచ్చని అధికారాలకు తేల్చిచెప్పారు. రహదారులు, భవనాల శాఖకు ప్రజలతో ప్రత్యేక్ష సంబంధం ఉంటుందని రోడ్లు బాగ లేకపోతే ప్రజలు ఇబ్బంది పడతారని, అందుకే మీరంత కష్టపడి పనిచేసి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని సూచించారుఐదుగురు సీఈలకు ఆర్ ‌ఒ బీ శాఖలోని వివిధ విభాగాలకు బాధ్యులుగా నియమిస్తూ ప్రభుత్వం జీ.ఓ.ఆర్టీ నెంబర్ 40 ని తీసుకువచ్చింది.వారిలో..శ్రీమతి ఎస్. తిరుమల గారికి అడ్మినిస్ట్రేషన్,శ్రీమతి టీ జయభారతి గారికి లెఫ్ట్ వింగ్ ఎక్స్ ట్రిమిసమ్శ్రీ టీ. రాజేశ్వర్ రెడ్డి, గారికి రైల్వే సేఫ్టీ వర్క్స్, పబ్లిక్ ప్రైవేట్ పార్ట్ నర్ షిప్ ప్రాజెక్ట్స్, ఎక్స్ టెర్నల్ ఎయిడెడ్ ప్రాజెక్ట్స్ తో పాటు సిఆర్ఐఎఫ్శ్రీ. జి. చిన్న పుల్లదాసు గారికి మెంబర్ ఆఫ్ కమీషనరేట్ ఆఫ్ టెండర్స్శ్రీ డి. శ్యామ్ కుమార్, గారికి రూరల్ రోడ్స్, ఎస్సీఎస్డీఎఫ్, ఎస్టీఎస్డీఎఫ్

# కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక బడ్జెట్‌ను నిరసిస్తూ కేంద్ర బడ్జెట్ ప్రతులు దగ్ధం

**హైదరాబాద్ (మన వెలుగు) ఫిబ్రవరి 01 :** రూ.50,65,345 కోట్లతో 2025 26 కేంద్ర బడ్జెట్‌ను ఈరోజు (తేది: 01 -02-%2025)న ఆర్థికమంత్రి నిర్మాలా సీతారామన్ పార్లమెంట్‌లో ప్రవేశపెట్టింది. గత బడ్జెట్ కంటే సుమారు రూ.3 లక్షల కోట్లు ఈ బడ్జెట్‌లో అదనంగా కేటాయించినా జిడిపి లోటు 4.4%గా చూపడం ఆర్థిక వ్యవస్థపై ప్రతికూల ప్రభావం పడనున్నదని సిఐటియు రైతు వ్యవసాయ కార్మిక సంఘాల రాష్ట్ర కమిటీలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఈ బడ్జెట్‌లో ఫిస్కల్ రెవెన్యూ లోటు రూ.15,68,936 కోట్లు కాగా నికర లోటు రూ.5,23,246 కోట్లు. మొత్తం బడ్జెట్‌లో మార్కెట్ అప్పులు రూ.11,53,834 కోట్లు మరియు ఇతర అప్పులు రూ.15,66,452 కోట్లు. మొత్తం అప్పులు రూ.27,20,286 కోట్లుగా ప్రతిపాదించడం ప్రస్తుత ఆర్థిక సంక్షోభ పరిస్థితుల్లో మన ఆర్థిక వ్యవస్థపై ప్రతికూల ప్రభావం పడనున్నది. ఈ నేపథ్యంలో 202526 కేంద్ర బడ్జెట్‌ను తెలంగాణ రాష్ట్రంలోని కార్మిక, రైతాంగ, వ్యవసాయ కార్మికులు తీవ్రంగా వ్యతిరేకించాలని పిలుపునిస్తున్నాయి. ఈ బడ్జెట్ ప్రతిపాదనలకు వ్యతిరేకంగా ఫిబ్రవరి 1, 2, 3 తేదీల్లో సిఐటియు, తెలంగాణ రైతు సంఘం, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో అన్ని జిల్లా కేంద్రాల్లో జరిగే నిరసన కార్యక్రమాల్లో కార్మికులు, రైతాంగం, వ్యవసాయ కార్మికులు వేలాదిగా పాల్గొనాలని కోరుతున్నాయి. ఈరోజు (తేది: 01%-02-%2025)న సిఐటియు రైతు వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో హైదరాబాద్ ఆర్‌టిసి క్రాస్ రోడ్స్ వద్ద బడ్జెట్ ప్రతులను దగ్ధం చేయడం జరిగింది. ఈ సందర్భంగా సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్, రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి. సాగర్, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్. వెంకట్రాములు మాట్లాడుతూ...సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల్లో ఉపాధి కల్పన, కార్మిక భద్రతకు సంబంధించిన అంశాలు ఈ బడ్జెట్‌లో ప్రతిపాదించకపోవడం అన్యాయం. విభజన హామీ చట్టంలోని అంశాలను తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డ 10 సం?ల తర్వాత కూడా పరిష్కరించే చర్యలు తీసుకోకపోవడం




మోసం. వ్యవసాయ రంగానికి మొదటి ప్రాధాన్యత అని చెప్పి బడ్జెట్ కేటాయింపులు ప్రకటించకుండా రైతాంగాన్ని కేంద్ర బిజెపి ప్రభుత్వం మరోసారి మోసగించింది. రైతు ఋణమాఫీ పథకం, ధరల స్థిరీకరణ, ఉపాధి హామీ పథకానికి నిధుల పెంపును విస్మరించింది. విద్యుత్‌రంగం సంస్కరణలు వ్యవసాయ, పారిశ్రామిక రంగాలకు తీవ్ర హాని కలగనున్నది. బీమా రంగంలో ఎఫ్‌డిఐలు 74 శాతం నుండి 100 శాతం పెంచడం జాతీయ బీమా సంస్థలను బలహీనం చేయడమే. ఆర్థిక సంస్కరణలు అమలు చేసే రాష్ట్రాలకే కేంద్రం సహకరిస్తామని బడ్జెట్‌లో ప్రకటించడం ఫెడరల్ స్ఫూర్తికి విఘాతం. అణు ఇంధన సంస్థలను పూర్తిగా ప్రైవేటీకరించి, ఖనిజ సంస్థలను కార్పొరేట్ కంపెనీలకు కారుచౌకగా కట్టబెట్టేందుకు బరితెగించింది. కార్మికవర్గం సుదీర్ఘకాలం లేబర్ కోడ్‌ల రద్దుకు, కనీస వేతనం

2లో

# ఇది కార్పొరేట్‌ల అనుకూల బడ్జెట్

## తెలంగాణ ఊసే లేని బడ్జెట్

కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ 2025-26 సంవత్సరానికి ప్రవేశపెట్టిన బడ్జెట్ ఇది. బడా కార్పొరేట్‌ల ప్రయోజనాలను కాపాడే బడ్జెట్‌గా వున్నది. సామాన్య ప్రజలకు నేరుగా లబ్ది కల్పించేందుకు ఎటువంటి ప్రసంగమూ, పథకం లేదు. వేతన జీవులను పెద్దఎత్తున సంతృప్తి పరుస్తామని చెప్పి ముష్టి వేసినట్లు ఊరట కల్పించారు. దేశ ప్రజల (కార్పొరేట్‌లు) బడ్జెట్ అని ప్రధాని మోడీ గొప్పలు చెప్పుకోవడం విడ్డూరంగా వున్నది. ప్రజా వ్యతిరేకంగా వున్న బడ్జెట్‌ను నిరసిస్తూ రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు తెల్పాలని సిపిఐ(ఎం) తెలంగాణ రాష్ట్రకమిటీ పిలుపునిస్తున్నది. రాష్ట్రంలో ఇద్దరు బిజెపి మంత్రులు, 8మంది పార్లమెంట్ సభ్యులు వున్నప్పటికీ రాష్ట్రానికి రావాల్సిన నిధులను రాబట్టలేకపోయారు. రాష్ట్ర విభజన హామీలు గాలికొదిలేశారు. ఆదిలాబాద్‌లో సిసిఐ ఫ్యాక్టరీలు, రాష్ట్రంలో విమానాశ్రయాల ఏర్పాటుకు రైల్వేకోచ్ ఫ్యాక్టరీ,

2లో

MANA VELUGU TELUGU DAILY



# కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక బడ్జెట్‌ను నిరసిస్తూ కేంద్ర బడ్జెట్ ప్రతులు దగ్ధం

రూ.26,000/%-%ల డిమాండ్, స్కీమ్ వర్కర్స్‌ను కార్మికులుగా గుర్తించాలన్న డిమాండ్, అసంఘటిత కార్మికుల సంక్షేమం వంటి అంశాలను ఈ బడ్జెట్‌లో ప్రస్తావించకపోవడం కార్మిక వ్యతిరేక చర్య.వ్యవసాయ, పారిశ్రామిక సంక్షోభం, అధికస్థాయి నిరుద్యోగం, ఆహార ద్రవ్యోల్బణం, అసమానతలు, ప్రైవేట్ పెట్టుబడుల పెంపు వంటి ఆర్థిక పరిస్థితుల నేపథ్యానికి అనుగుణంగా 2025%-%26 బడ్జెట్ రూపకల్పన చేయకపోవడం కొనుగోలు శక్తి క్షీణతకు దారితీస్తుంది. ఈ బడ్జెట్ సాధారణ ప్రజలు, కార్మికవర్గంపై రానున్న రోజుల్లో మరిన్ని భారాలు మోపి ఉపాధి కల్పన స్థాయిలను మరింత క్షీణింపజేస్తుంది.మధ్యతరగతికి రూ.12 లక్షల వరకు పన్ను మినహాయింపును బడ్జెట్‌లో ప్రకటించినా, పాత పద్ధతిలో ఎటువంటి మార్పులను ప్రస్తావించకపోవడం మధ్యతరగతి ప్రజలకు నష్టం. అదే సమయంలో సంపద పన్ను 3 శాతానికి తగ్గించి మధ్యతరగతిపై ఆదాయపు పన్ను విధింపు ధనవంతులకు లబ్ధి చేకూర్చడమే. పెన్షన్ రంగానికి నిధులు పెంచకపోవడం.స్థూలంగా 10 సం?ల బిజెపి ప్రభుత్వ కార్పొరేట్ విధానాలు, సంపన్నుల ప్రయోజనాలే ప్రాధాన్యతనిచ్చి ప్రవేశపెట్టిన 2025%-%26 కేంద్ర బడ్జెట్‌ను తెలంగాణ రాష్ట్ర కార్మికవర్గం యావత్తూ తీవ్రంగా నిరసించాలని సిఐటియు తెలంగాణ రాష్ట్ర కమిటీ కోరుతున్నది.ఈ కార్యక్రమంలో సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు భూపాల్, వి.ఎస్.రావు, ఎస్వీ. రమ, పి. జయలక్ష్మి, రాష్ట్ర కార్యదర్శి జె. వెంకటేష్, రాష్ట్ర కోశాధికారి వంగూరు రాములు, రాష్ట్ర కమిటీ సభ్యులు పుప్పాల శ్రీకాంత్, పి. సుధాకర్, ఎ. సునీత, యాటల సోమన్న, ఆర్. కోటంరాజు, ఎస్ఎస్ఆర్ఎ ప్రసాద్, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి పద్మ, నాయకులు ఆంజనేయులు, టిఎంఎస్ఆర్‌యు నాయకులు సిహెచ్. భానుకిరణ్, రాజు భట్, హైదరాబాద్ సెంట్రల్ సిటీ నాయకులు జె. కుమారస్వామి, యాదమ్మ, మల్లేష్, రాములు, వి. సందీప్ తదితరులు పాల్గొన్నారు.

# ఇది కార్పొరేట్‌ల అనుకూల బడ్జెట్

## తెలంగాణ ఊసే లేని బడ్జెట్

బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ, ఐఎఫ్ఎం, హైస్పీడ్ రైల్వే ట్రాక్‌లకు నిధుల ఊసే లేదు. రాబోవు ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని కొన్ని రాష్ట్రాలకు మాత్రమే నిధులు కేటాయించారు. రు.50,65,345 కోట్లతో ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్‌లో రు.12,76,338 కోట్లు, అనగా 25.2 శాతం వడ్డీల చెల్లింపుకే కేటాయించారు. వ్యవసాయ రంగానికి గతం కన్నా రు.10వేల కోట్లు తగ్గించారు. ఎరువుల సబ్సిడీకి రు.11వేల కోట్లు తగ్గించారు. ప్రధాని మోడీ దేశంలో 25 కోట్ల మందిని దారిద్రరేఖకు ఎగువకు తెచ్చామని చెబుతూనే, 2029 వరకు 80 కోట్ల మందికి 5 కిలోల చొప్పున రేషన్ షాపుల ద్వారా ఉచిత బియ్యం పంపిణీ చేస్తామన్నారు. ఉపాధి హామి పథకానికి 2023-24లో 89,154 కోట్లు ఖర్చు చేయగా, ప్రస్తుత బడ్జెట్‌లో రు.86వేల కోట్లు మాత్రమే కేటాయించారు. దళిత, గిరిజనులకు బడ్జెట్, సబ్‌ప్లాన్ క్రింద చేసినకేటాయింపులు ఆ వర్గాల అభివృద్ధికి ఏమాత్రం ఉపయోగపడడం లేదు. ఈ వర్గాలకు కేటాయించిన నిధులను నోడల్ ఆఫీసర్ ద్వారా ఆవాసాలు, రహదారులు, త్రాగునీరు, విద్య, వైద్య సౌకర్యాలు కల్పించినచో ఆ వర్గాల్లో కొంతమేరకైనా అభివృద్ధి జరుగుతుంది.దళితులకు 16శాతం కేటాయించాల్సి వుండగా, 5శాతం నిధులు మాత్రమే కేటాయించారు. గిరిజనులకు 7శాతం నిధులు కేటాయింపునకు బదులు 2శాతం కేటాయించారు. విద్య, వైద్య రంగాలకు చాలా స్వల్పంగా కేటాయింపులు 3శాతానికి లోపే కేటాయింపులు వున్నాయి. పారిశ్రామిక రంగం ఉత్పత్తికి బడ్జెట్ కేటాయింపులు పెంచాలి. కార్పొరేట్లకు పన్ను రాయితీలు, బ్యాంకుల అప్పుల ఎగవేతకు అవకాశం కల్పిస్తూ తయారు చేసిన ఈ బడ్జెట్‌ను పారిశ్రామిక, వ్యవసాయ అభివృద్ధికి అనుకూలంగా తీర్చిదిద్దాలి. వలసలను, ఆత్మహత్యలను నిరోధించే విధంగా బడ్జెట్‌ను రూపొందించాలని సిపిఐ(ఎం) తెలంగాణ రాష్ట్రకమిటీ డిమాండ్ చేస్తున్నది.

# సిరియా తాత్కాలిక అధ్యక్షులుగా అహ్మద్ అల్ షరా

**డమాస్కస్ :** సిరియా తాత్కాలిక అధ్యక్షులుగా అహ్మద్ అల్ షరా ఎంపికయ్యారు. సిరియా రాజధాని డమాస్కస్‌లో తిరుగుబాటు గ్రూపుల మధ్య జరిగిన సమావేశంలో ఈ ఎంపిక జరిగింది. తిరుగుబాటు గ్రూపు హయత్ తహ్రీర్ అల్ షామ్ అధ్యక్షుడిగా షరా పనిచేస్తున్నారు. ఈ గ్రూపు గతంలో అల్‌ఖైదాకు అనుబంధ గ్రూపుగా ఉండేది. ప్రస్తుతం తమకు అల్‌ఖైదాతో సంబంధాలు లేవని షరా చెబుతున్నారు. షరాపై అమెరికా గతంలో 10 మిలియన్ డాలర్ల బహుమతిని ప్రకటించింది. గత నెలలో అమెరికా ప్రతనిధి బృందం సిరియాలో పర్యటించిన తరువాత ఆ బహుమతిని రద్దు చేసింది. గత ఏడాదిలో తిరుబాటు దళాలు దాడి చేయడంతో అధ్యక్షుడు బషర్ అల్ అసద్ ప్రభుత్వం కూలిపోయింది. అసద్ ప్రస్తుతం రష్యా ఆశ్రయంలో ఉన్నారు.



# హిజ్బుల్లా స్థావరాలపై ఇజ్రాయిల్ దాడులు

**బీరుట్ :** సిరియా-లెబనాన్ సరిహద్దు పొడవునా బెకా వ్యాలీలో హిజ్బుల్లా స్థావరాలను లక్ష్యంగా చేసుకుని గురువారం రాత్రంతా దాడులు జరిపినట్లు ఇజ్రాయిల్ మిలటరీ శుక్రవారం ప్రకటించింది. ఈ లక్ష్యాల్లో భూగర్భంలో ఆయుధాల అభివృద్ధికి ఉపయోగించే కేంద్రం, లెబనాన్‌లోకి ఆయుధాలను అక్రమంగా రవాణా చేసే స్థావరం వున్నాయని ఆర్మీ తెలిపింది. గురువారం హిజ్బుల్లా ప్రయోగించిన నిఘా డ్రోన్‌ను తాము అడ్డుకున్నామని, ఇది, ఇజ్రాయిల్, లెబనాన్ మధ్య కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించడమేనని ఇజ్రాయిల్ పేర్కొంది. నవంబరు చివరిలో హిజ్బుల్లా, ఇజ్రాయిల్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందం కుదిరింది. తొలుత జనవరి 26వరకే ఈ ఒప్పందం అమల్లో వుంటుందని ప్రకటించినా తర్వాత ఫిబ్రవరి 18వరకు పొడిగించారు. అప్పటి వరకు ఈ ఒప్పందం అమలవుతుందని అమెరికా కూడా గత ఆదివారం ధ్రువీకరించింది. ఆలోగా ఇజ్రాయిల్ బలగాలు లెబనాన్ నుండి ఉపసంహరించాల్సిందేనని లెబనాన్ అధ్యక్షుడు జోసెఫ్, ఈజిప్ట్ విదేశాంగ మంత్రి బాదర్‌కు స్పష్టం చేశారు. ఎలాంటి జాప్యాన్ని సహించేది లేదని అన్నారు. కాల్పుల విరమణ ఒప్పందం పొడిగించినప్పటి నుండి లెబనాన్ గడ్డపై ఇజ్రాయిల్ పలు దాడులు జరిపింది. వందమందికి పైగా గాయపడ్డారు. ముగ్గురు బందీలను గాజాలో శనివారం విడుదల చేయనున్నట్లు హమాస్ సాయుధ విభాగమైన ఖసమ్ బ్రిగేడ్స్ వెల్లడించింది. జైళ్లలో ఉన్న 90మంది పాలస్తీనియన్లను విడుదల చేయనున్నట్లు ఇజ్రాయిల్ ప్రకటించిందని పాలస్తీనా ఖైదీల మీడియా కార్యాలయం తెలిపింది. వెస్ట్ బ్యాంక్‌లోని జెనిన్ శరణార్ధ శిబిరంపై జరిగిన దాడిలో మరో ఇద్దరిని ఇజ్రాయిల్ బలగాలు కాల్చిచంపాయి. గాజా తీరంలో ఇజ్రాయిల్ గన్‌బోట్‌ల వల్ల ఒక జాలరి కూడా మరణించాడు. గురువారం విడుదలైన ఐదుగురు థాయి జాతీయలు పూర్తి ఆరోగ్యంతో వున్నారని ఇజ్రాయిల్ డాక్టర్లు వెల్లడించారు. హమాస్ బందించిన వారిలో మొత్తంగా 31మంది థాయి జాతీయులు వున్నారు. థాయి బందీలను విడుదల చేసేటప్పుడు డజన్ల సంఖ్యలో ఇజ్రాయిల్ డాక్టర్లు,



నర్సులు, ఇజ్రాయిల్ ప్రతినిధులు ఇజ్రాయిల్, థాయిలాండ్ పతాకాలను ఊపుతూ, పాటలు పాడుతూ హర్షం వ్యక్తం చేశారు.

స్పేస్‌వాక్ సమయంలో సునీతా విలియమ్స్ రికార్డు

భారతీయ సంతతి వ్యోమగామి సునీతా విలియమ్స్ మొత్తం స్పేస్‌వాక్ సమయంలో ఒక మహిళా వ్యోమగామిగా 62 గంటల 6 నిమిషాలు సాధించి రికార్డు సృష్టించారు. 2024 జూన్ నుంచి అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలో సునీతా విలియమ్, ఆమె సహచర వ్యోమగామి బచ్ విల్మోర్ చిక్కుకున్న సంగతి తెలిసిందే. వీరిద్దరూ గురువారం స్పేస్‌వాక్ చేశారు. వీరిద్దరూ ఏమాత్రం పనిచేయని రేడియో కమ్యూనికేషన్స్ హార్డ్‌వేర్‌ను తొలగించడానికి ఐఎస్ఎస్ బయటకు వచ్చి పరీక్షించారు. కక్ష లేబొరేటరీ బయటను సూక్ష్మజీవులు ఉన్నాయేమో అన్న అనుమానంతో శాంపిల్స్ సేకరించారు. వీరి స్పేస్‌వాక్ ఈస్ట్‌టైమ్ ప్రకారం ఉదయం 7,43కు ప్రారంభమై మధ్యాహ్నం 1.09గంటలకు ముగిసింది. అంటే 5 గంటల 26 నిమిషాల పాటు స్పేస్‌వాక్ సాగింది. విలియమ్స్‌కు ఇది తొమ్మిదో స్పేస్‌వాక్ కాగా, విల్మోర్‌కు ఐదోది. ఇదివరకటి మాజీ వ్యోమగామి పెగ్గీ విట్‌సన్స్ మొత్తం స్పేస్‌వాక్ సమయం 60 గంటల 21 నిమిషాలు కాగా, ఆ రికార్డును విలియమ్స్ అధిగమించారని నాసా తన ఎక్స్ పోస్ట్‌లో వెల్లడించింది. నాసా ఆల్‌టైమ్ లిస్టులో విలియమ్స్ నాలుగో స్థానాన్ని సాధించారు.

# అనిశ్చితి ఉన్నా ఆర్థిక సుస్థిరత

**న్యూఢిల్లీ :** అనిశ్చితి ఉన్నా ఆర్థిక సుస్థిరత సాధించామని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పేర్కొన్నారు. 'విధాన పరమైన పక్షవాత' స్థితి నుండి ఆర్థిక వ్యవస్థను బయటకు తీసుకురావడానికి ప్రభుత్వం దృఢ సంకల్పంతో కృషి చేసిందని ముక్తాయించారు. పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల ప్రారంభ సందర్భంగా ఆనవాయితీ ప్రకారం పార్లమెంటు సెంట్రల్ హాలులో శుక్రవారం ఏర్పాటు చేసిన ఉభయ సభల సంయుక్త సమావేశాన్నుద్దేశించి అమె ప్రసంగించారు. రాష్ట్రపతి ప్రసంగాన్ని కేంద్ర మంత్రివర్గం రూపొందిందిస్తుంది. దానినే రాష్ట్రపతి పొల్లు పోకుండా చదివి వినిపిస్తారు. ద్రౌవపది ముర్ము కూడా అదే పనిచేశారు. కోవిడ్, యుద్ధాలు, ఘర్షణలు ఇలా పలు రకాలైన అనిశ్చిత పరిస్థితులను అంతర్జాతీయంగా ఎదుర్కొంటున్నప్పటికీ భారత ఆర్థిక వ్యవస్థ మాత్రం గుర్తించదగిన సుస్థిరతను ప్రదర్శిస్తూ తన బలాన్ని నిరూపించుకుందని అన్నారు. ఆర్థిక, సామాజిక, రాజకీయ సుస్థిరతకు మూలస్తంభంగా నిలిచిన భారత్ యావత్ ప్రపంచానికి ఒక ఉదాహరణగా మారిందని పేర్కొన్నారు. రాష్ట్రపతి తన ప్రసంగంలో ప్రధానంగా మధ్య తరగతి వర్గాల గురించి పదే పదే ప్రస్తావించారు. . మధ్య తరగతి ప్రజలు ఎంత పెద్ద కలలు కంటే దేశం అంత ఎత్తుకు ఎదుగుతుందని వ్యాఖ్యానించారు. జమిలి ఎన్నికలు (ఒకే దేశం, ఒకే ఎన్నిక), వక్ఫ్ సవరణ బిల్లును సాహసోపేత నిర్ణయాలుగా ఆమె



అభివర్ణించారు. ప్రపంచంలోనే భారత్‌ను మూడో ఆర్థిక శక్తిగా నిలపనున్నట్లు తెలిపారు. దేశాభివృద్ధి ఫలాలు అందరికీ అందించడమే ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. ఒక దేశం, ఒక ఎన్నికకు తమ ప్రభుత్వం కట్టుబడి వుందన్నారు. 'బడ్జెట్-2025లో రైతులు, మహిళలు, పేదలు, యువతకు ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. ప్రభుత్వ పథకాల గురించి ఏకరువు పెట్టారు. ఉద్యోగుల కోసం 8వ వేతన సంఘాన్ని నియమించామన్నారు. ఒక దేశం, ఒక ఎన్నిక గురించి పాత పాటే పాడారు. భారత్ త్వరలోనే మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా మారుతుందని చెప్పారు.

# సవాళ్లకు నీళ్లొదిలిన కేంద్రం

## ఎకనామిక్ సర్వే వెల్లడి

**న్యూఢిల్లీ :** దేశ ఆర్థిక స్థితికి అద్దం పట్టే అధికారిక వార్షిక నివేదిక ఎకనామిక్ సర్వేలో అనేక సవాళ్లను మోడీ సర్కార్ విస్మరించింది. అంతర్జాతీయంగా ట్రంప్ టారిఫ్‌ల పెంపు, ఎగుమతుల పతనం, వాణిజ్య లోటు సమస్యలకు పరిష్కారం చూపలేదు. మరోవైపు రికార్డ్ కనిష్టానికి పడిపోయిన రూపాయి విలువపై లెక్కలేని తనంగా వ్యవహరించింది. ఎకనామిక్ సర్వేలో ప్రధానంగా దేశం ఎదుర్కొంటున్న సవాళ్లు, అవకాశాలను పొందుపర్చాలి. గడిచిన ఆర్థిక సంవత్సరంలో జరిగిన ప్రధాన మార్పులు, పరిణామాల్ని చెప్పి.. భవిష్యత్తు ప్రణాళికలు ఎలా ఉండాలో మార్గదర్శనం చేయాలి. ప్రధాన రంగాలైన వ్యవసాయం, పారిశ్రామికోత్పత్తి, మౌలిక సదుపాయాలు, ఎగుమతి దిగుమతులు, విదేశీ మారక నిల్వలు, నగదు చలామణి, ఉద్యోగాలు, ధరల పెరుగుదల వంటి అంశాలను కూడా వివరిస్తుంది. విదేశీ భౌగోళిక, ఆర్థిక పరిణామాల ప్రభావం, ప్రభుత్వ విధాన నిర్ణయాలను విశ్లేషించాలి. దీని ఆధారంగానే ప్రతి సంవత్సరం కేంద్ర బడ్జెట్ రూపకల్పన జరుగుతుంటుంది. దీనికి భిన్నంగా దిశానిర్దేశం లేని ఎకనామిక్ సర్వేను బిజెపి ప్రభుత్వం ప్రవేశపెట్టింది. శుక్రవారం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన ఆర్థిక సర్వేలో అనేక సవాళ్లు, పరిష్కారాలకు నీళ్లు వదిలేశారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 2024-25లో జిడిపి 6.4 శాతానికి పడిపోయి.. నాలుగేళ్ల కనిష్టానికి చేరొచ్చని అంచనా వేసిన ఆర్థిక సర్వే.. వృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై వివరించలేదు. అమెరికా అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ ఎన్నికైన తర్వాత భారత్‌పై సుంకాలను పెంచుతామని బహిరంగంగా ప్రకటించారు. డాలర్‌తో రూపాయి మారకం విలువ రికార్డ్ స్థాయిలో 87కి చేరువలో పతనమయ్యింది. ఎగుమతులు పతనం అవుతున్నాయి. వాణిజ్య లోటు పెరుగుతోంది. అనేక రంగాలు మౌలిక వసతుల సదుపాయాల కొరతను ఎదుర్కొంటున్నాయి. పెరుగుతున్న నిరుద్యోగం, ఆర్థిక అసమానతలు, అసంఘటిత రంగం కార్మికుల జీవన ప్రమాణాల మెరుగుదల, మందగిస్తున్న పరిశ్రమల వృద్ధికి తీసుకోవాల్సిన చర్యలు, వ్యవసాయాన్ని సంక్షోభం నుంచి గట్టెక్కించే మార్గాలను ఆర్థిక సర్వే గట్టున పెట్టేసింది. ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి రానున్న రోజుల్లో తీసుకోవాల్సిన చర్యల్ని విస్మరించింది. అమెరికా, చైనా లాంటి దేశాలు కృత్రిమ మేధ (ఎఐ)లో పోటీ పడుతూ.. ఈ రంగంలో దూసుకుపోతుండగా.. టెక్నాలజీలో అత్యంత నైపుణ్యం కలిగిన మానవ వనరులున్న భారత్ వెనుకబాటుపై వివరణ ఇవ్వలేదు. దేశం మెరుగైన వృద్ధి రేటును సాధించకుండా నిరుద్యోగం తగ్గిందని ఎకనామిక్ సర్వేలో ప్రకటన చేయడం నిపుణులను విస్మయానికి గురి చేస్తోంది.

# సిపిఎం త్రిపుర రాష్ట్ర కార్యదర్శిగా

## జితేంద్ర చౌదరి ఎన్నిక

**న్యూఢిల్లీ :** సిపిఎం త్రిపుర రాష్ట్ర కార్యదర్శిగా జితేంద్ర చౌదరి తిరిగి ఎన్నికయ్యారు. 60 మందితో రాష్ట్ర నూతన కమిటీ ఎన్నికైంది. వారిలో 14 మందితో రాష్ట్ర కార్యదర్శివర్గం ఎన్నికైంది. త్రిపుర రాజధాని అగర్తలాలో మూడు రోజులపాటు జరిగిన సిపిఎం త్రిపుర రాష్ట్ర 24వ మహాసభ శుక్రవారం ముగిసింది. ఈ మహాసభకు సిపిఎం సమన్వయకర్త ప్రకాశ్‌కరత్, మాజీ ముఖ్యమంత్రి మాణిక్ సర్కార్, పొలిట్‌బ్యూరో సభ్యులు బృందా కరత్, అశోక్ ధావలే, కేంద్ర కమిటీ సభ్యులు ఆర్ అరుణ్ కుమార్ తదితరులు హాజరయ్యారు. రాష్ట్ర కార్యదర్శి జితేంద్ర చౌదరి రాజకీయ, నిర్మాణ నివేదికను ప్రవేశపెట్టారు. ఈ నివేదికపై 45 మంది ప్రతినిధులు చర్చించారు. అనంతరం మహాసభ ఏకగ్రీవంగా నివేదికను ఆమోదించింది. నూతన రాష్ట్ర కమిటీని మహాసభ ఎన్నుకుంది. రాష్ట్ర కార్యదర్శిగా జితేంద్ర చౌదరి తిరిగి ఎన్నికయ్యారు. 60



మందితో రాష్ట్ర నూతన కమిటీ, 14 మందితో రాష్ట్ర కార్యదర్శివర్గం ఎన్నికైంది. పార్టీ క్షేత్రస్థాయిలో బలోపేతం చేయాలని, బిజెపి ప్రభుత్వానికి వ్యతిరేకంగా, ప్రజా సమస్యలపై పోరాటాన్ని తీవ్రతరం చేయాలని మహాసభ పిలుపునిచ్చింది.

# డాక్టర్‌పై గ్యాంగ్‌రేప్ కేసులో నలుగురికి 20 ఏళ్ల జైలు



**వెల్లూరు :** వైద్యురాలిపై సామూహిక అత్యాచారం కేసులో తమిళనాడు మహిళా కోర్టు సంచలన తీర్పునిచ్చింది. నలుగురు దోషులకు కోర్టు 20 ఏళ్ల కఠిన కారాగార శిక్ష విధించింది. ఒక్కొక్కరికి రూ.25 వేల జరిమానా విధించింది. 2022 మార్చి 16వ తేదీన తమిళనాడులోని వెల్లూరులో బీహార్‌కు చెందిన వైద్యురాలు, మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌కు చెందిన తన సహోద్యోగితో కలిసి కాట్పాడిలో సినిమాకి వెళ్లారు. సినిమా అయ్యాక షేర్ ఆటో ఎక్కారు. అప్పటికే ఆ ఆటోలో నలుగురు ఉన్నారు. ఓల్డ్ టౌన్‌లోని చెన్నై %-% బెంగళూరు హైవేలోని గ్రీన్ సర్కిల్ వద్దకు తీసుకెళ్లేందుకు అంగీకరించిన డ్రైవర్ శ్మశానవాటిక సమీపంలోని నిర్జన ప్రదేశంలోకి తీసుకెళ్లాడు. అక్కడ వైద్యురాలితోపాటు ఆమె మిత్రుడిని కొట్టి బెదిరించారు. ఆ తర్వాత ఆమెపై లైంగిక దాడికి పాల్పడ్డారు. ఆమె వద్ద రూ.40వేలతో పాటు బంగారాన్ని లూటీ చేశారు. లేడీ డాక్టర్ కొద్దిరోజులు భయంతో పోలీసులకు ఫిర్యాదు చేయలేదు. అనంతరం ఆన్‌లైన్‌లో పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి ముగ్గురు నిందితులను అరెస్టు చేశారు. తాగిన మత్తులో సామూహిక అత్యాచారం చేసినట్లు అంగీకరించారు. కొద్దిరోజులకు మిగతా నిందితులను సైతం అరెస్టు చేశారు. ఆటో డ్రైవర్ పార్థిబన్, రోజువారీ కూలీ మణి అలియాస్ మణికందన్ (25), అతని స్నేహితులు భరత్ (23), సంతోష్ (22)లను అరెస్టు చేశారు. ఐదో నిందితుడు మైనర్ కావడంతో జువెనైల్ జస్టిస్ బోర్డు ముందు హాజరుపరిచారు. కేసు విచారించిన వెల్లూరు సెషన్స్ (ఫాస్ట్ ట్రాక్ మహిళా కోర్టు) జడ్జి ఎస్ మహేశ్వరి భానురేఖ ముందు నిందితులను హాజరుపరచగా.. నలుగురు నిందితులను దోషులుగా తేలుస్తూ 20 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష విధించారు. రూ.25వేల జరిమానా చెల్లించాలని ఆదేశించారు. అప్పట్లో ఈ కేసు దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. తమిళనాడు అసెంబ్లీని కుదిపేసింది.

# రాష్ట్రపతి ప్రసంగంపై సోనియా గాంధీ వివాదాస్పద వ్యాఖ్యలు



**న్యూఢిల్లీ :** పార్లమెంటు ఉభయ సభలను ఉద్దేశించి రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము చేసిన ప్రసంగంపై కాంగ్రెస్ అగ్రనాయకురాలు, ఎంపీ సోనియా గాంధీ చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదం అయ్యాయి. పార్లమెంట్ వెలుపల రాష్ట్రపతి ప్రసంగంపై అభిప్రాయం చెప్పాలని మీడియా సోనియాను కోరగా అందుకు ప్రతిస్పందన 'పూర్ థింగ్. ప్రసంగం చివరికి వచ్చే వరకు రాష్ట్రపతి బాగా అలసిపోయారు' అని వ్యాఖ్యానించారు. సోనియా వ్యాఖ్యలపై బిజెపి మండిపడింది. ఆమె క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేసింది.అదే సమయంలో రాహుల్ గాంధీ వెంటనే జోక్యం చేసుకుని 'బోరింగ్, నో కామెంట్స్, చెప్పిందే పదేపదే చెప్పారు' అన్నారు. కాగా బిజెపి అధ్యక్షుడు, కేంద్ర ఆరోగ్య మంత్రి జెపి. నడ్డా దీనిపై ప్రతిస్పందిస్తూ 'రాజ్యాంగపు అత్యున్నత పదవిలో ఉన్న వ్యక్తిపై ఇలాంటి అవమానకర వ్యాఖ్య చేయడం ఆక్షేపణీయం' అన్నారు. ఎఐసిసి చీఫ్ ఖర్గే స్పందిస్తూ సోనియా వ్యాఖ్యలను బిజెపి, ఆ పార్టీ అనుకూల మీడియా వక్రీకరించిందని తిప్పికొట్టారు. సోనియా గాంధీ చేసిన వ్యాఖ్యలపై వివాదం తలెత్తడంతో కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ వివరణ ఇచ్చారు. తన తల్లికి రాష్ట్రపతిపై అపార గౌరవం ఉందని, కానీ మీడియానే ఆమె వ్యాఖ్యలను వక్రీకరించిందని అన్నారు. సోనియా గాంధీని క్షమాపణ కోరిన బిజెపి మీద ప్రియాంకవిరుచుకుపడ్డారు. దేశాన్ని నాశనం చేస్తున్నందుకు బిజెపియే క్షమాపణ చెప్పాలని అన్నారు. కాంగ్రెస్ డిప్యూటీ లీడర్ గౌరవ్ గొగోయ్ కూడా ఈ విషయంలో బిజెపిని విమర్శించారు. ' సోనియా గాంధీకి రాష్ట్రపతి ఆరోగ్యంపై ఆందోళనే తప్ప అగౌరవం లేదు. దీనిని బిజెపి జీర్ణించుకోలేకపోతోంది' అన్నారు.

# బడ్జెట్‌లో మహిళలు, పేదలు, మధ్యతరగతికి ప్రాధాన్యం



**న్యూఢిల్లీ :** పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల ప్రారంభం వేళ రేపటి బడ్జెట్‌లో పేద, మధ్యతరగతితోపాటు మహిళలకు పెద్దపీట వేస్తారన్న అంచనాలు ప్రధాని మోడీ వ్యాఖ్యల బట్టి తెలుస్తోంది. సంపదకు, పురోగతి వర్ధిల్లేలా పేదలు, మధ్యతరగతిపై మహాలక్ష్మి ప్రత్యేక కటాక్షం చూపించాలని ప్రార్థిస్తున్నట్టు ఆయన పేర్కొన్నారు. మహిళలకు సమాన హక్కులు ఉండాలని స్పష్టం చేస్తూ మతపరమైన, వర్గపరమైన విభేదాల నుంచి వారు స్వేచ్ఛగా ఉండాలని ఆకాంక్షించారు. అనుకున్న లక్షాల సాధనకు చెప్పుకోతగిన నిర్ణయాలు బడ్జెట్‌లో ఉంటాయని పేర్కొన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ సంక్షేమ పథకాలకు కేంద్ర బిందువుగా ఉన్న మహిళలకు తగిన గౌరవం, హోదా ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. ఈ బడ్జెట్ సమావేశాల్లో అనేక చారిత్రాత్మక బిల్లులు, ప్రతిపాదనలపై చర్చించడమవుతుందని, అవి చట్టాలుగా రూపొంది, దేశాన్ని మరింత పటిష్టం చేస్తాయని అభిప్రాయం వెలిబుచ్చారు. పార్లమెంట్ ఉభయసభలను ఉద్దేశించి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము కూడా పేదలు, మధ్య తరగతి ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తోందని ప్రస్తావించారు. " ఈరోజు పేదలు, మధ్యతరగతి , యువత, మహిళలు, రైతులకు అత్యధిక ప్రాధాన్యం కల్పించి అసాధారణమైన వేగంతో తీసుకుంటున్న ప్రధాన నిర్ణయాలకు, విధానాలకు దేశం సాక్షంగా ఉంటోంది." అని రాష్ట్రపతి ముర్ము పేర్కొన్నారు.

# ఈ దఫా పార్లమెంట్ సెషన్ ఒక విధంగా విశిష్టమైనది

**న్యూఢిల్లీ :** పార్లమెంట్ సెషన్ ప్రారంభం కావడానికి ముందు దేశంలో 'అగ్గి రగిల్చేందుకు' బహుశా 2014 తరువాత మొదటి సారిగా విదేశాల నుంచి ఎటువంటి ప్రయత్నమూ జరగలేదని ప్రధాని నరేంద్ర మోడీ శుక్రవారంచెప్పారు. పార్లమెంట్ బడ్జెట్ సెషన్‌కు ముందు విలేకరులతో మాట్లాడిన ప్రధాని మోడీ ప్రతిపక్షాల తీరుపై కూడా వ్యంగ్యోక్తులు విసిరారు. 2014 దరిమిలా ప్రతి సెషన్‌కు ముందు ఏదో ఒక అలజడి రేకెత్తించేందుకు విదేశాల్లో కొందరు సిద్ధంగా ఉండేవారని, అటువంటి యత్నాలను ఎగసనదోసేవారికి ఇక్కడా కొరత ఉండేది కాదని ఆయన ఆరోపించారు. (బహుశా 2014 తరువాత మొదటిసారిగా పార్లమెంట్ బడ్జెట్ సెషన్‌కు ఒకటి రెండు రోజుల ముందు విదేశాల నుంచి అగ్గి రగిల్చేందుకు ఎటువంటి యత్నమూ జరగలేదు' అని అన్నారు. 'విదేశాల్లో ఎక్కడ నుంచీ అగ్గి రగిల్చే యత్న ఏడీ జరగకనపోవడం గల పది సంవత్సరాల్లో మొదటిసారిగా చూస్తున్నాను' అని ప్రధాని చెప్పారు. తన ప్రభుత్వం మూడవ విడత శనివారం తన పూర్తి స్థాయి బడ్జెట్‌ను ప్రవేశపెట్టనుండడంతో, నిరుపేద, మధ్య తరగతి వర్గాలవారిని లక్ష్మీదేవి కనికరించాలని తాను ప్రార్థించినట్లు తెలియజేశారు. 2047 నాటికి 'వికసిత్ భారత్' లక్షాన్ని సాధించడంలో కొత్త విశ్వాసాన్ని, శక్తిని ఈ బడ్జెట్ సెషన్ ఇస్తుందనే దృఢనమ్మకాన్ని మోడీ వ్యక్తం చేశారు. సర్వతోముఖ అభివృద్ధి కోసం తన ప్రభుత్వం మూడవ విడత మిషన్ తరహాలో వ్యవహరిస్తోందని ఆయన చెప్పారు. సృజనాత్మకత, సమ్మిళితం, పెట్టుబడి ప్రభుత్వ ఆర్థిక అజెండాను తీర్చిదిద్దాయని ఆయన తెలిపారు. ఈ సెషన్‌లో పలు చరిత్రాత్మక బిల్లులు చేపట్టనున్నట్లు, దేశ పటిష్ఠతకు సమగ్ర చర్చ అనంతరం అవి చట్టాలు కానున్నట్లు మోడీ చెప్పారు. 'ముఖ్యంగా, మహిళలు సమాన హక్కులు పొందేందుకు, వర్గ లేదా మతవిశ్వాస ఆధారిత వివక్ష తొలగించేందుకు వీలుగా వారి సాధికారతకు ఈ సెషన్‌లో ముఖ్యమైన నిర్ణయాలు తీసుకోనున్నారు' అని ఆయన సూచించారు.

# స్పేస్‌వాక్ సమయంలో సునీతా విలియమ్స్ రికార్డు

భారతీయ సంతతి వ్యోమగామి సునీతా విలియమ్స్ మొత్తం స్పేస్‌వాక్ సమయంలో ఒక మహిళా వ్యోమగామిగా 62 గంటల 6 నిమిషాలు సాధించి రికార్డు సృష్టించారు. 2024 జూన్ నుంచి అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలో సునీతా విలియమ్, ఆమె సహచర వ్యోమగామి బచ్ విల్మోర్ చిక్కుకున్న సంగతి తెలిసిందే. వీరిద్దరూ గురువారం స్పేస్‌వాక్ చేశారు. వీరిద్దరూ ఏమాత్రం పనిచేయని రేడియో కమ్యూనికేషన్స్ హార్డ్‌వేర్‌ను తొలగించడానికి ఐఎస్ఎస్ బయటకు వచ్చి పరీక్షించారు. కక్ష లేబొరేటరీ బయటను సూక్ష్మజీవులు ఉన్నాయేమో అన్న అనుమానంతో శాంపిల్స్ సేకరించారు. వీరి స్పేస్‌వాక్ ఈస్ట్‌టైమ్ ప్రకారం ఉదయం 7,43కు ప్రారంభమై మధ్యాహ్నం 1.09గంటలకు ముగిసింది. అంటే 5 గంటల 26 నిమిషాల పాటు స్పేస్‌వాక్ సాగింది. విలియమ్స్‌కు ఇది తొమ్మిదో స్పేస్‌వాక్ కాగా, విల్మోర్‌కు ఐదోది. ఇదివరకటి మాజీ వ్యోమగామి పెగ్గీ విట్‌సన్స్ మొత్తం స్పేస్‌వాక్ సమయం 60 గంటల 21 నిమిషాలు కాగా, ఆ రికార్డును విలియమ్స్ అధిగమించారని నాసా తన ఎక్స్ పోస్ట్‌లో వెల్లడించింది. నాసా ఆల్‌టైమ్ లిస్టులో విలియమ్స్ నాలుగో స్థానాన్ని సాధించారు.

# ఒక్కో మైగ్రెంట్‌కు 4675 డాలర్ల ఖర్చు

**గ్వాటెమాలా సిటీ :** చట్టబద్ధమైన పత్రాలు లేకుండా అమెరికాలో నివసిస్తున్న వారిని బలవంతంగా వారి స్వదేశాలకు పంపించే ప్రక్రియ గత వారం రోజుల నుండి శరవేగంగా కొనసాగుతోంది. ఇప్పటివరకు లాటిన్ అమెరికా దేశాలకు ఆరు విమానాలను పంపించారు. వీటిలో అమెరికాకు రెండు కార్గో విమానాలను తమ దేశంలో దిగేందుకు కొలంబియా నిరాకరించింది. ట్రంప్‌తో ప్రతిష్టంభన నెలకొన్న నేపథ్యంలో మైగ్రెంట్లను తీసుకొచ్చేందుకు తమ స్వంత విమానాలనే పంపించింది. మిగిలిన నాలుగు విమానాలు గ్వాటెమాలా లోనే దిగాయి. ఇందులో భాగంగా గ్వాటెమాలాకు వెళుతున్న మిలటరీ విమానంలో ఒక్కో మైగ్రెంట్‌కు 4675 డాలర్లు ఖర్చవుతోంది. టెక్సాస్‌లోని ఎల్‌పాసో నుండి అమెరికన్ ఎయిర్‌లైన్స్‌కి చెందిన విమానంలో గ్వాటెమాలాకు వెళ్లాలంటే అయ్యే ఫస్ట్ క్లాస్ టిక్కెట్ కన్నా ఇది ఐదు రెట్లకు మించి అధికమని అమెరికా, గ్వాటెమాలా అధికారులు అందజేసిన డేటా పేర్కొంటోంది. ఫస్ట్ క్లాస్ టికెట్ ధర 853 డాలర్లుగా వుంది. పైగా అమెరికా ఇమ్మిగ్రేషన్, కస్టమ్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్‌కి చెందిన కమర్షియల్‌చార్టర్ విమానానికి అయ్యే ఖర్చు కన్నా కూడా ఇది చాలా ఎక్కువ. సి-17 సైనిక రవాణా విమానానికి గంటకు 28,500 డాలర్లు నిర్వహణా వ్యయం అవుతుందని పేరు చెప్పడానికి ఇష్టపడని అమెరికా అధికారి ఒకరు వెల్లడించారు. గ్వాటెమాలాకు వెళ్లి రావడానికి పదిన్నర గంటలు పడుతుంది. విమానాశ్రయంలో ఆగిన సమయాన్ని, లేదా టేకాఫ్ ఆపరేషన్స్‌కు పట్టే సమయాన్ని ఇందులో కలపలేదని ఆ అధికారి తెలిపారు. 64మందితో సోమవారం సైనిక రవాణా విమానం ఒకటి ఇక్కడకు వచ్చిందని గ్వాటెమాలా అధికారి తెలిపారు.

# గచ్చిబౌలిలో కాల్పుల కలకలం



**హైదరాబాద్ :** గచ్చిబౌలిలో కాల్పుల కలకలం. ఓ పబ్‌లో దొంగను పట్టుకునే క్రమంలో ఈ ఘటన జరిగింది. కాల్పులు జరిపినా పోలీసులు సాహసం చేసి దొంగను అదుపులోకి తీసుకున్నారు. విషయం తెలుసుకున్న పోలీస్ ఉన్నతాధికారులు ఘటనపై ఆరా తీశారు. సైబరాబాద్ సీసీఎస్ కానిస్టేబుల్ వెంకట్ రెడ్డి పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. కానిస్టేబుల్‌తో పాటు పబ్‌లో ఉన్న బౌన్సర్‌కు కూడా గాయాలయ్యాయి. అయితే దొంగ కాల్పులు జరిపిన దొంగ మోస్ట్‌వాంటెడ్ క్రిమినల్ ప్రభాకర్‌గా చెబుతున్నారు. ఆపై దుండుగుడ్ని అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. అతనిపై ఎన్ని కేసులు ఉన్నాయి. ఎంత కాలం నుంచి పరారీలో ఉన్నాడు. అసలు ఎందుకు కాల్పులు జరిపాడు. అతనికి గన్ ఎక్కడిది.? అనే అంశాలపై పోలీసులు ఆరా తీస్తున్నారు.ఈ ఘటనతో పబ్ లోపల, బయట టెన్షన్ వాతావరణం నెలకొంది. ఒక్కసారిగా కాల్పుల శబ్ధంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. దొంగ కాల్పులు జరుపుతున్న సమయంలో ఏం జరుగుతుందో అర్ధంకాక గందరగోళానికి గురయ్యారు. పోలీసులు, దొంగలను చూసి ఒక్కసారిగా హడలిపోయారు.

# వికసిత్ భారత్ 2047 విజన్ కల

## సాకారానికి ముందడుగు



**హైదరాబాద్ :** కేంద్ర బడ్జెట్ 2025-26లో ప్రగతిశీల మరియు దూరదృష్టితో కూడిన ప్రకటనల కోసం గౌరవనీయులైన ఆర్థిక మంత్రికి నా హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. మైనింగ్ ముఖ్యమైన పాత్ర పోషిస్తున్న ఆరు డొమైన్‌లలో పరివర్తనాత్మక సంస్కరణలను ప్రారంభించడం ఈ బడ్జెట్ లక్ష్యం అని గౌరవనీయ ఆర్థిక మంత్రి శ్రీమతి నిర్మలా సీతారామన్ ఉద్ఘాటించారు.రాబోయే ఐదేళ్లలో మన ప్రపంచ పోటీతత్వాన్ని బలోపేతం చేస్తూ ఇంధన పరివర్తన, స్థిరమైన అభివృద్ధి వైపు భారత్ అడుగులు వేస్తుందనడానికి ఈ బడ్జెట్ సూచిస్తుందన్నారు. మైనింగ్ రంగంలో సంస్కరణలు, ముఖ్యంగా కీలకమైన ఖనిజాలకు సంబంధించి, ఆత్మనిర్భర్, భవిష్యత్తు-సన్నద్ధమైన భారత్‌ను నిర్మించడంలో ఈ బడ్జెట్ దోహదపడుతోంది. విక్షిత్ భారత్ 2047 దార్శనికతను సాకారం చేయడంలో ఒక ప్రధాన అడుగు పడిందని కిషన్ రెడ్డి అభిప్రాయపడ్డారు.బొగ్గు గనుల రంగంలో సంస్కరణల శ్రేణి స్వదేశంలో ఉత్పత్తి, ఆవిష్కరణలను ప్రోత్సహిస్తుంది. అదే సమయంలో ప్రపంచ ఖనిజాల మార్కెట్‌లో భారతదేశాన్ని కీలక ప్లేయర్‌గా మారనుంది. సంస్కరణలు నేషనల్ క్రిటికల్ మినరల్ మిషన్ ప్రారంభానికి అనుకూలమైన సమయంలో వస్తాయి. ఇందుకు కేంద్ర బడ్జెట్ భారీ ప్రోత్సాహాన్ని ఇస్తాయన్నారు. ఇంధన భద్రత, ఇంధన పరివర్తన లక్ష్యాల మధ్య సమతుల్యతను సాధించడంపై దృష్టి కేంద్రం దృష్టి సారించినట్లు కేమంత్రి కిషన్ రెడ్డి స్పష్టం చేశారు.కాంపిటేటివ్ ఫెడరలిజం స్ఫూర్తికి అనుగుణంగా, స్టేట్ మైనింగ్ ఇండెక్స్ పరిచయం అనేది రాష్ట్ర మైనింగ్ డిపార్ట్‌మెంట్ల ప్రొఫెషనలైజేషన్‌ను మెరుగుపరిచి, ఖనిజాల అన్వేషణ, స్థిరమైన మైనింగ్‌లో ఉత్తమ పద్ధతులను ఆవిష్కరించడానికి సహాయపడుతుందన్నారు. పెట్టుబడులను ఆకర్షించడంతోపాటు మన ఖనిజ వనరుల యొక్క అపారమైన సామర్థ్యాన్ని అన్‌లాక్ చేస్తుందన్నారు కేంద్ర మంత్రి.

# 10 రోజులుగా తల్లి మృతదేహంతో ఇద్దరు కూతుళ్లు

**హైదరాబాదు**లో దారుణ ఘటన చోటుచేసుకుంది. కొన్ని కారణాల చేత తల్లి లలిత అకాల మరణం చెందింది. తల్లి దహన సంస్కారాలకు కూడా డబ్బులు లేకపోవడంతో ఏం చేయాలో తోచని ఇద్దరు కూతుళు మృతదేహాన్ని బయటికి తీసుకెళ్లలేక ఇంట్లోనే పెట్టుకుని పది రోజులపాటు గడిపారు. సికింద్రాబాద్ లోని వారాసిగూడ లో ఈ ఘటన చోటుచేసుకుంది. జనవరి 22న లలిత అకాలమరణం చెందింది. 23 ఉదయం ఎంత లేపిన తల్లి కళ్ళు తెరవకపోవడంతో ఇద్దరు కూతుర్లు ఆందోళన చెందారు. అయితే చివరికి తమ తల్లి చనిపోయినట్లు నిర్ధారించుకున్నారు.అయితే అప్పటికే ఆర్థిక సమస్యలతో పాటు కుటుంబ సమస్యలు కూడా వీరిని వెంటాడాయి. తల్లి చనిపోయిన విషయం కనీసం బంధువులకు కూడా చెప్పుకోలేని దయనీయ స్థితిలో ఉన్నారు. తల్లి మృతదేహానికి దహన సంస్కారాలు చేసేందుకు కావలసిన డబ్బులు కూడా తమ వద్ద లేకపోవడంతో ఇంట్లోనే తల్లి మృతదేహాన్ని ఉంచి పది రోజులు గడిపారు. ఇక బాడీ డీకంపోస్ అవుతున్న నేపథ్యంలో స్థానిక ఎమ్మెల్యే దగ్గరికి వెళ్లి జరిగిన విషయం చెప్పి సహాయం కోరారు. స్పందించిన ఎమ్మెల్యే వెంటనే పోలీసులకు సమాచారం అందించి ఫిర్యాదు చేసేలా ఇద్దరు కూతుళ్లకు సలహా ఇచ్చారు.

# త్యాగరాజ స్వామి సంగీత, సాంస్కృతిక వారసత్వ సంపదకి వందనం




**శేర్లింగంపల్లి (మన వెలుగు) ఫిబ్రవరి 01 :** హెచ్ టి ఏ ఎం ఎఫ్ 2025 నాలుగవ రోజు ఉదయం హైదరాబాద్ జంట నగరాలలోని ప్రసిద్ధ శాస్త్రీయ సంగీత గురువుల శిష్యబృందాల ప్రదర్శనలు జరిగాయి. సాయంత్రం త్యాగరాజ స్వామి కృతి దుడుకు గల కి గురుకులం విద్యార్థులు, గురు విదుషి పోపూరి తులసి శిష్యుల కూచిపూడి అభినయంతో ప్రారంభమైంది. ఘనరాగ పంచరత్న కీర్తనలలో ఒకటైన ఈ కృతికి ఎంతో అనువైన భావప్రకటనతో ఈ నృత్యం ప్రేక్షకులకి కనువిందు చేసింది. సంగీత కచేరీలలో మొదటగా విదుషి లలిత మాధవ్ భమిడిపాటి శ్రావ్యమైన గాత్రం శ్రోతల హృదయాలని స్పృశిస్తూ, ఎంతగానో రంజింపజేసింది. విదుషి బి.వి.దుర్గా భవాని వయొలిన్ పైన, విద్వాన్ పి. జయభాస్కర్ మృదంగం పైన, విద్వాన్ రాహుల్ సుందర్ కస్తూరి ఘటం పైన వాద్యసహకారాన్ని అందించారు. ఆ తరువాత విద్వాన్ యు. పి. రాజు,విదుషి యు. నాగమణి, చి. యు. జయ విఘ్నేశ్వర్‌ల మాండొలిన్ కచేరీ శ్రోతలని ఎంతో ఆకట్టుకుంది. వీరికి విద్వాన్ పి. జయభాస్కర్ మృదంగం పైన, విద్వాన్ వేముగంటి శ్రీధరాచార్య ఘటం పైన వాద్యసహకారాన్ని అందించారు. వేర్వేరు లయల ప్రయోగాలతో త్యాగరాజ స్వామి కృతులను రసస్ఫోరకంగా పలికించిన తీరు శ్రోతలని విశేషంగా ఆకర్షించింది.అనంతరం ముఖ్య ఆహ్వానితులుగా విచ్చేసిన నాదసుధార్ణవ పద్మశ్రీ డా. అన్నవరపు రామస్వామి, విదుషి అయ్య శ్రీవిద్య, కూచిపూడి విదుషీమణి సరళకుమారి ఈనాటి కార్యక్రమంలో పాల్గొన్న విద్వాంసులని సన్మానించారు. ఈ హైదరాబాద్ త్యాగరాజ ఆరాధనా సంగీతోత్సవం 10వ సంచిక ఫిబ్రవరి 2వ తేదీ (ఆదివారం) ఉదయం పంచరత్న సేవతో ముగుస్తుంది. అదే సందర్భంలో సంస్కృతి ఫౌండేషన్ వారు ప్రసిద్ధ కర్నాటక వాయులీన విద్వాంసులు,నాదసుధార్ణవ డా. అన్నవరపు రామస్వామికి గురుసన్మానం చేస్తారు. సాయంత్రం ప్రఖ్యాత విదుషీమణులు ప్రియ సిస్టర్స్ కచేరీ తో ఉత్సవాలు ముగుస్తాయి.

# బాసర అమ్మవారి బాధ్యత మనది

## - స్వచ్ఛభారత్ లో ఎమ్మెల్యే రామారావ్ పటేల్



**బాసర (మన వెలుగు) ఫిబ్రవరి 01 :** వసంత పంచమి వేళ బాసర జ్ఞాన సరస్వతి అమ్మవారి సన్నిధిలో ప్రభుత్వం ఏర్పాట్లపై నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో ఎమ్మెల్యే రామారావు పటేల్ ప్రభుత్వ వైఖరి పై మండిపడుతూ తమ పుణ్యక్షేత్రాన్ని తామే కాపాడుకుంటామని స్వచ్ఛభారత్ కార్యక్రమానికి పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే పిలుపుతో ముధోల్ నియోజకవర్గం నుండి పెద్ద మొత్తంలో బిజెపి కార్యకర్తలు బాసర అమ్మవారి క్షేత్రానికి చేరుకున్నారు. ఉదయం 9 గంటల నుండి సాయంత్రం వరకు వారు విధుల్లో నిమగ్నమై ఘట్ల వద్ద ఉన్న చెత్తాచెదారాన్ని తొలగించారు. ఎమ్మెల్యే వారితో కలిసి పనిచేయడంతో పాటు అక్కడే మధ్యాహ్నం వరకు ఉండి కార్యకర్తలతో కలిసి ఘట్ల వద్ద భోజనం చేశారు. ఎమ్మెల్యే పటేల్ స్వచ్ఛభారత్ కు మద్దతుగా అనుష కన్స్ట్రక్షన్స్ ముందుకు వచ్చి పనులు చేపట్టింది. అదేవిధంగా ప్రభుత్వ యంత్రాంగంలో కదలిక రావడంతో ఆయా గ్రామాల పంచాయతీ కార్మికులు, బాసర పంచాయతీ కార్మికులు పారిశుద్ధ పనుల్లో నిమగ్నమయ్యారు. ఏది ఏమైనా ఎమ్మెల్యే రామారావు పటేల్ పిలుపునిచ్చిన స్వచ్ఛభారత్ తో బాసర గోదావరి ఘాట్లు శుభ్రమై, నది తీరాన కొత్త కళ వచ్చింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పవర్ రామారావు పటేల్ మాట్లాడుతూ దేశంలోనే ప్రముఖ పుణ్యక్షేత్రమైన బాసర అమ్మవారి పుట్టిన రోజైన వసంత పంచమి వేళ ఏర్పాట్లపై ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదన్నారు. హిందువుల పండుగ అంటే చిన్న చూపా, అని మండిపడ్డారు. ఆలయ అధికార యంత్రాంగం పనితీరు పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. ఒక్క పిలుపుతో కదిలి వచ్చిన బిజెపి కార్యకర్తలకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. ఇకనైనా బాసర ఆలయ అభివృద్ధిపై రాష్ట్ర ప్రభుత్వం వివక్ష చూపకూడదన్నారు. గత పదేళ్లుగా బీఆర్ఎస్ పాలనలో ఇదే పరిస్థితి ఉందని, కాంగ్రెస్ ప్రభుత్వం బాసర ఆలయ అభివృద్ధిపై దృష్టిసాధించాల్సిందిగా కోరారు.

# స్నాక్స్ కాదు సంపూర్ణ ఫలితాలు రావాలి

## - పది విద్యార్థులకు ఎమ్ఈఓ మైసాజీ సూచన



**ముధోల్ (మన వెలుగు) ఫిబ్రవరి 01 :** మండల కేంద్రమైన బాసరలోని ఉర్దూ మీడియం ఉన్నత పాఠశాలలో శనివారం 10వ తరగతి విద్యార్థులకు నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతుల్లో స్నాక్స్ ను అందించారు. ఈ సందర్భంగా బాసర మండల విద్యాధికారి జి. మైసాజీ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా పదవ తరగతి విద్యార్థుల కోసం నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతుల్లో స్నాక్స్ ను అందించే కార్యక్రమాన్ని ప్రారంభించింది అన్నారు. ఆరు రోజులపాటు వివిధ రకాల స్నాక్సను విద్యార్థులకు సాయంత్ర సమయంలో నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతుల్లో అందిస్తున్నామన్నారు. రాబోయే పదవ తరగతి వార్షిక పరీక్షల్లో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. ముఖ్యంగా సబ్జెక్టుల వారిగా విద్యార్థులకు నిపుణులతో ప్రత్యేక తరగతులను నిర్వహిస్తున్నామన్నారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

# ముగిసిన అఖండ హరినామ సప్తహం

## - మంగళ హారతులతో మహిళల శోభా



**ముధోల్ (మన వెలుగు) ఫిబ్రవరి 01 :** ముధోల్ మండలంలోని చించాల గ్రామంలో గత ఏడు రోజులుగా భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్న అఖండ హరినామ సప్తహ శనివారం ముగిసింది. చివరి రోజు కావడంతో మహిళలు ఉదయాన్నే మంగళ హారతులతో సప్తహలో పాల్గొన్నారు. నారాయణ మహారాజ్ ఆధ్వర్యంలో ప్రతిరోజు కాగడ హారతి,గథభజన, సంకీర్తనలు నిర్వహించారు. అనంతరం గ్రామంలోని ప్రధాని నిధుల గుండా శోభయాత్రను నిర్వహించి, జ్ఞానేశ్వరి పారాయణం చేశారు. దీంతో ఏడు రోజులుగా కొనసాగిన సప్తహ హాజరైన భజనదిండులను భజన బృందం సభ్యులు శాలువాలతో ఘనంగా సన్మానించారు. గత 25 సంవత్సరాల నుండి గ్రామంలో సప్తహ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందని గ్రామ పెద్దలు తెలిపారు. ఈ సప్తహ కు వచ్చిన భక్తులందరికీ అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి లక్ష్మీ నర్సా గౌడ్, వైస్ పిఎసిఎస్ చైర్మన్ సాయిరాం, మాజీ సర్పంచ్ రాం చందర్, గ్రామస్తులు, నాయకులు, యువకులు, తదితరులున్నారు.

# కుంభమేళాలో బాసర ప్రముఖులు



**ముధోల్ (మన వెలుగు) ఫిబ్రవరి 01 :** ప్రపంచంలో అతిపెద్ద ఆధ్యాత్మిక ఉత్సవంగా పేరుగాంచిన కుంభమేళా లక్షలాది మంది భక్తులతో కన్నుల పండువుగా మారింది. సామాన్య భక్తులు మాత్రమే కాకుండా, ప్రముఖులు, వ్యాపారవేత్తలు, సమాజ సేవకులు సైతం ఈ మహోత్సవంలో పాల్గొని త్రివేణి సంగమంలో పవిత్ర స్నానం చేస్తున్నారు.ఈ నేపథ్యంలో శనివారం నిర్మల్ జిల్లా బైంసా కు చెందిన ప్రముఖ వ్యాపారవేత్త ప్రతాప్ రెడ్డి, ప్రభుత్వ ఆసుపత్రిలో విధులు నిర్వహిస్తున్న సమాజ సేవకుడు తాడేవార్ కరుణాకర్ మిత్రబృందంతో కలిసి కుంభమేళాలో పాల్గొన్నారు. త్రివేణి సంగమంలో అమృత స్నానాలు ఆచరిస్తూ, ఈ పవిత్ర క్షేత్రంలో స్నానం చేయడం జీవితంలో గొప్ప భాగ్యం అని అభిప్రాయపడ్డారు. ఇది పూర్వ జన్మలో చేసిన పుణ్యం వల్లే సాధ్యమవుతుందని, కుంభమేళా స్నానం తమకు ధార్మికంగా, ఆధ్యాత్మికంగా కొత్త అనుభూతిని కలిగించిందని వారు అన్నారు.కుంభమేళా మహోత్సవం భారతీయ సంస్కృతికి ప్రతీకగా, హిందూ ధర్మ విశ్వాసాలకు అద్దంగా నిలుస్తుందని భక్తులు అభిప్రాయపడ్డారు.

# ఒంటరితనంతో భరించలేక వ్యక్తి ఆత్మహత్య



**ముధోల్ (మన వెలుగు) ఫిబ్రవరి 01:** ఒంటరితనంతో భరించలేక వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన శనివారం బైంసా మండలంలో చోటుచేసుకుంది సిఐ మల్లి తెలిపిన వివరాల ప్రకారం సంక్లి గ్రామానికి చెందిన రాజేందర్ (37)కు ఆరేళ్ల క్రితం విడాకులయ్యాయి ఇప్పటినుంచి ఒంటరితనాన్ని భరించలేకపోయాడు దీంతో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు అన్నారు కుటుంబ సభ్యులు ఫిర్యాదు తో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు

# ఏటీఎం పగలగొట్టి దొంగ




**నిర్మల్ ప్రతినిధి (మన వెలుగు) ఫిబ్రవరి 01:** నిర్మల్ పట్టణంలో ఏటీఎం సెంటర్లో దొంగతనానికి ప్రయత్నించిన గుర్తు తెలియని వ్యక్తిపై కేసు నమోదైన ఘటన శనివారం నిర్మల్ పట్టణంలో చోటుచేసుకుంది పట్టణ సీఐ ప్రవీణ్ కుమార్ తెలిపిన వివరాల్లో మేరకు పట్టణాల్లోని గాజులపేట్ ఎస్బిఐ ఎటిఎం లో గుర్తు తెలియని వ్యక్తి ప్రవేశించి మిషన్ పగలగొట్టి దొంగతనానికి ప్రయత్నించాడన్నారు బ్యాంకు సిబ్బంది ఫిర్యాదు మేరకు సీసీ కెమెరాల్లో పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు

# విహార యాత్రకి రబింద్ర విద్యార్థులు




**ముధోల్ (మన వెలుగు) ఫిబ్రవరి 01:** బాసరలోని శ్రీ చదువుల తల్లి నిలయమైన శ్రీ జ్ఞాన సరస్వతి, సారంగాపూర్ లోని హనుమాన్ దేవాలయా నికి రబింద్ర ప్లే స్కూల్ విద్యార్థులు విహారయాత్రలో భాగంగా బయలుదేరారు. ఈ సందర్భంగా మాఘమాసం మొదటి శనివారం కావడంతో పాఠశాల విద్యార్థులు, టీచర్లు విహారయాత్రగా రావడం వెళ్లడం జరిగిందనీ ప్రిన్సిపాల్ ఆసంవార్ సాయినాథ్ అన్నారు. శ్రీ జ్ఞాన సరస్వతి, హనుమాన్ మందిరాన్ని దర్శించి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థులకు ఆధ్యాత్మికతను అలవాటు చేసుకోవాలని, దేవాలయాల ప్రాముఖ్యతను వివరించారు. భారతదేశంలోని పవిత్ర పుణ్యక్షేత్రం బాసర అని విద్యార్థులకు తెలియజేశారు ఈ కార్యక్రమం లో ప్లే స్కూల్ ఇంచార్జ్ హేమ లత, ఉపధ్యాయులు, విద్యార్థిని, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా శ్రీ భక్త మార్కండేయ జయంతి



**ముధోల్ (మన వెలుగు) ఫిబ్రవరి 01:** ముధోల్ మండలంలోని చించాల గ్రామంలో పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో భక్త మార్కండేయ జయంతిని ఘనంగా నిర్వహించారు. శ్రీ భక్త మార్కండేయ జయంతిని పురస్కరించుకొని పురోహితులు బసవరాజు ఆధ్వర్యంలో మార్కండేయ మందిరంలో అన్నపూజ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి సంఘం సభ్యులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు

# సిఐ నిరంజన్ రెడ్డిని సన్మానించిన ఎంఐఎం నాయకులు



**మెట్ పల్లి టౌన్ (మన వెలుగు) ఫిబ్రవరి 01 :** మెట్ పల్లి సిఐ నిరంజన్ రెడ్డికి ప్రతిష్టాత్మక ఇండియన్ పోలీస్ మెడల్ అవార్డు వచ్చిన సందర్భంగా ఆల్ ఇండియా మజ్లిస్ ఎత్తేహాదుల్ ముస్లిమీన్ మెట్ పల్లి టౌన్ ప్రెసిడెంట్ మహమ్మద్ అఖిల్ మరియు మజ్లిస్ నాయకులు శనివారం ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. సీఐ నిరంజన్ రెడ్డి మరింత ఉన్నత పదవులు పొందాలని మరిన్ని అవార్డులు పొందాలని ఆకాంక్షించారు.అనంతరం సిఐ నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ.. ఇండియన్ పోలీస్ మెడల్ సాధించడం చాలా సంతోషంగా ఉందని అన్నారు.ఈ కార్యక్రమంలో మొహమ్మద్ అక్రమ్. మొహమ్మద్ షకీల్. గఫ్ఫార్ చాంద్. హాఫిజ్ ఇర్ఫాన్.ఘని రహమాన్.జమాల్ భాయ్.చాంద్. షిబాజ్. అమిర్,పాల్గొన్నారు..

# పేదింటి మహిళ పెళ్ళికి సిఐ నిరంజన్ రెడ్డి చేతుల మీదుగా పుస్తె మట్టెలు అందజేత



**మెట్‌పల్లి (మనవెలుగు) ఫిబ్రవరి 01 :** మండలం బండలింగాపూర్ గ్రామంలో నివసిస్తున్న సాయమ్మ అనే పేదింటి మహిళ కుమార్తె రమ్య వివాహానికి పుస్తె, మట్టెలు మరియు పట్టు చీరను ఫ్రెండ్స్ వెల్ఫేర్ చారిటబుల్ ట్రస్ట్ వారి సహకారంతో మెట్ పల్లి సిఐ నిరంజన్ రెడ్డి చేతులమీదుగా శనివారం అందజేశా రు.ఇలాంటి సమాజ హితం కార్యక్రమాలను నిర్వహిస్తున్న ట్రస్ట్ సభ్యులను సిఐ అభినందించారు.ఈ సందర్భంగా సిఐ నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ...ఫ్రెండ్స్ వెల్ఫేర్ చారిటబుల్ ట్రస్ట్ అనేది పేద ప్రజలకు సహాయం చేయడానికి స్థాపించబడిన ఒక స్వచ్ఛంద సంస్థ. ఈ సంస్థ అనేక సంవత్సరాలుగా పేద ప్రజలకు సహాయం చేస్తోంది. ఈ సంస్థ విద్య, వైద్యం మరియు ఇతర రంగాలలో సహాయం అందిస్తుంది.రమ్య వివాహానికి పుస్తె, మట్టెలు మరియు పట్టు చీరను ఫ్రెండ్స్ వెల్ఫేర్ చారిటబుల్ ట్రస్ట్ వారు అందజేశారు

# సిఐ నిరంజన్ రెడ్డిని సన్మానించిన గట్టిపెల్లి రాజశేఖర్

**మెట్ పల్లి (మన వెలుగు) ఫిబ్రవరి 01 :** జగిత్యాల జిల్లా మెట్ పల్లి పట్టణ పోలీస్ స్టేషన్లో విధులు నిర్వహిస్తున్న సిఐ నిరంజన్ రెడ్డిని ఆర్.ఆర్ న్యూస్ తెలంగాణ సీఈవో గట్టిపెల్లి రాజశేఖర్ మరియు వీ6 న్యూస్ రిపోర్టర్ నన్నపరాజ్ రవిరాజ్ లు ఇండియన్ పోలీస్ మెడల్ కు ఎంపికైన సందర్భంగా శనివారం సిఐ నిరంజన్ రెడ్డిని సన్మానించారు. ఈ సందర్భంగా గట్టిపెల్లి రాజశేఖర్ మాట్లాడుతూ..1989 సంవత్సరంలో కానిస్టేబుల్ గా ఎంపికై సుదీర్ఘకాలం 2023 వరకు వివిధ హోదాలలో పనిచేస్తూ ఎలాంటి రిమార్కులు లేని పోలీస్ గా డిపార్ట్మెంట్ మరియు ప్రజల మన్ననలు పొందారు. సిఐ నిరంజన్ రెడ్డి కానిస్టేబుల్ నుండి సిఐ హోదా వరకు ఎన్నో ఎన్నెన్నో అవార్డులు రివార్డులు అధికారుల ప్రశంసలు అందుకున్నారు పోలీసుగా నిక్కచిగా ఉంటూ.. ఎన్నో సామాజిక సేవా




కార్యక్రమాల్లో పాల్గొంటూ ఆపన్నులకు అండగా ఉంటారని,విధి నిర్వహణ లో ఉన్నత శిఖరాలకు ఎదగాలని ఇండియన్ పోలీస్ మెడల్ వచ్చిన సందర్భంగా సిఐ నిరంజన్ రెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్నామని అన్నారు.

# అన్ని శాఖల సమన్వయంతో ఆపరేషన్ స్మైల్-XI విజయవంతం

**- జిల్లా లో 30 బాల కార్మికులకు విముక్తి**

**- జిల్లా ఎస్పీ అశోక్ కుమార్**





**జగిత్యాల ప్రతినిధి (మన వెలుగు) ఫిబ్రవరి 01 :** బాలకార్మిక వ్యవస్థను నిర్మూలించడానికి సంవత్సరంలో రెండు సార్లు ఆపరేషన్ స్మైల్, మరియు ఆపరేషన్ ముస్కాన్ కార్యక్రమాలను నిర్వహించి తప్పిపోయిన బాలలను గుర్తించి వారి తల్లిదండ్రుల వద్దకు చేర్చడానికి జిల్లా వ్యాప్తంగా ఆపరేషన్ స్మైల్ కార్యక్రమం అన్ని శాఖల సమన్వయంతో విజయవంతంగా నిర్వహించడం జరిగింది. ఆపరేషన్ స్మైల్ విజయవంతం కోసం ఒక్కో సబ్ డివిజన్ పరిధిలో ఒక సబ్-ఇన్స్ పెక్టర్, ముగ్గురు కానిస్టేబుల్స్,ఒక మహిళ కానిస్టేబుల్ ను ప్రత్యేకంగా కేటాయించి చైల్డ్ లైన్ తో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి ప్రభుత్వేతర స్వచ్ఛంద సంస్థలను గుర్తించి విస్తృతంగా తనిఖీలు నిర్వహించడం జరిగింది . ఇందులో భాగంగా ఈ సంవత్సరం జనవరి 1 నుండి 31 వరకు ఆపరేషన్ స్మైల్-XI కార్యక్రమాన్ని జిల్లా వ్యాప్తంగా నిర్వహించడం జరిగింది ఇందులో 30 మంది బాలకార్మికులను గుర్తించి సిడబ్ల్యుసి (చైల్డ్ వెల్ఫేర్ కమిటీ) ముందు హాజరుపరచడం జరిగింది. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ... బాలల హక్కులను కాపాడాల్సిన బాధ్యత మానందరిపైనా ఉన్నదని, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన కోసం బాధ్యతాయుతంగా కృషి చేయాలని కోరారు. బాలల హక్కులను, బాలకార్మిక వ్యవస్థను నిర్మూలించడానికి ఆపరేషన్ స్మైల్, మరియు ముస్కాన్ కార్యక్రమాలను నిరంతరం నిర్వహించడం జరుగుతుంది అని అలాగే ఎవరైనా బాలలను పనిలో పెట్టుకున్న, ఎక్కడైనా పనిచేసిన, తప్పిపోయిన వదిలివేయబడిన బాలల సమాచారం తెలిసిన వెంటనే డయల్ 100 కి కాల్ చేసి పోలీసు వారికి సమాచారం ఇవ్వగలరు అని తెలిపారు. బాలకార్మికులుగా పెట్టుకున్న వారిపై కూడా చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు .పోలీసు శాఖతో కలిసి ఆపరేషన్ స్మైల్ XI విజయవంతం చేయడంలో కృషి చేసిన వివిధ శాఖల అధికారులను, సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

# జీవవైవిధ్య కేంద్రాలు.. చిత్తడి నేలలు

సముద్రం, నది, ఇతర నీటి వనరుల తీర ప్రాంతాలలో లోతు తక్కువ వుండి ఎక్కువ కాలం నీటి నిల్వ వుండే భూములను చిత్తడి నేలలు అంటారు. మంచి నీటి సరస్సులు, ఉప్పునీటి సరస్సులు, మడ అడవులున్న తీర ప్రాంతాలన్నీ చిత్తడి నేలలే. ఎగువ ప్రాంతంలోని భూములు అలల తాకిడికి దెబ్బ తినకుండా ఈ చిత్తడి నేలలు అడ్డు కట్ట వేస్తాయి. అరుదైన మొక్కలకు, పక్షులకు, జంతువులకు, చేపలు గుడ్లు పెట్టడానికి ఈ చిత్తడి నేలలు చాల అనుకూలం. సమీప నీటి నాణ్యతను పెంచడం లోను, కాలుష్య కారకాలను గ్రహించడం లోను చిత్తడి నేలలు ప్రాధాన్యతను పోషిస్తాయి. మానవుల తప్పిదాలతో పర్యావరణానికి చాల హాని కలుగు తున్నది. అలాగే చిత్తడి నేలలకు కూడా మినహాయింపు లేకుండా పోతున్నది. ఫలితంగా హాని జరుగు తున్నది. ప్రజలు వ్యవసాయ అవసరాలకు ఈ భూములను ఆక్రమించు కొని రసాయన ఎరువులకు వాడడం వల్ల.... నివాస యోగ్యానికి ఈ నేలలను పూడ్చడం తోను, చిత్తడి నేలలు విధ్వంసానికి గురవు తున్నాయి. ప్రభుత్వం పరిశ్రమల కొరకు చిత్తడి నేలలను కేటాయిచడంలో అవి మరింత విధ్వంసానికి గురవు తున్నాయి. చిత్తడి నేలల పరిరక్షణకు 1971, ఫిబ్రవరి రెండవ తేదీన ఇరాన్ లోని రాంసార్ లో ఒక అంతర్జాతీయ సదస్సు జరిగింది. అప్పుడు తీసుకున్న ఉమ్మడి ఒప్పందం పై 164 దేశాలు సంతకం చేశాయి. దాన్నే "రాంసార్ ఒప్పందం" అంటారు. చిత్తడి నేలల పరిరక్షణకు ఈ ఒప్పందంలో కొన్ని ప్రమాణాలను నిర్దేశించారు. భారత దేశం కూడా ఈ ఒప్పందం పై సంతకం చేసింది. చిత్తడి నేలలు జీవ వైవిద్యానికి కేంద్రాలు. ఈ ప్రదేశాలలో చాలా జల



చర, ఉభయ చర జీవులు... మొక్కలు, జంతువులు ఉంటాయి. చిత్తడి నేలలు ముఖ్యంగా నదీ పరీవాహక ప్రదేశాలు, సముద్ర తీర ప్రాంతాల కు సమీపంగా ఉంటాయి. ఇవి నదుల గుండా వచ్చే కాలుష్య కారక పదార్థాలను, తమలో ఇముడ్చు కుంటాయి. సముద్ర భారీ అలల నుండి సునామీల నుండి తీర ప్రాంతాలను రక్షిస్తాయి. అదే విధంగా నదుల వరదల నుండి కాపాడుతాయి. సముద్ర ప్రాంతాలు, నదీ తీరాలు, చెరువులు, సరస్సులు, నీటి ముంపు ప్రాంతాలు, తీరాల సమీపంలోని ఉప్పునీటి కయ్యలు, మడ అడవులు, మానవ నిర్మిత చేపల చెరువులు, వరి పొలాలు, సాగునీటి ఆనకట్టలు వంటివి చిత్తడి నేలల కోవకు చెందుతాయి. మానవాళి మనుగడకు ఈ నేలలు ఎంతో కీలకం. అయితే మానవుడు తన ఆవాసాల కోసం ఇలాంటి చిత్తడి నేలలను పూడ్చి గృహాలు నిర్మించడం వల్ల చిత్తడి నేలలు కనుమరుగు అవుతున్నాయి. దీనికి ఉదాహరణ ముంబై , కోల్ కత వంటి నగరాలు. దీని వల్ల బయో డైవర్సిటీ తీవ్రంగా నష్టపోతుండటం జరుగుతున్నది. ఈ క్రమంలో 1971 ఫిబ్రవరి 2 వ తేదీన ఇరాన్ దేశం లోని "రాంసార్" పట్టణంలో చిత్తడి నేలల సంరక్షణకు ఒక సదస్సు జరగగా, అన్ని దేశాలు చిత్తడి నేలలను రక్షించడానికి అంగీకరించాయి. అప్పటి నుండి ఫిబ్రవరి 2 వ తేదీని ప్రపంచ చిత్తడి నేలల దినోత్సవంగా జరుపు కుంటున్నారు. చిత్తడి నేలల అవసరాన్ని తెలియజెప్పి, సమాజాన్ని చైతన్య పరచడం ద్వారానే వాటిని పరిరక్షించు కోవడం సాధ్యమవుతుంది. అందుకోసం వివిధ స్థాయుల్లో అవగాహన కల్పించాలి. విద్యార్థులకు పాఠ్యాంశంగా చేయాలి. విద్యాలయాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి. సాగునీరు, వ్యవసాయ, మత్స్య, అటవీ ప్రభుత్వ విభాగాలు సమన్వయంతో చిత్తడి నేలల పరిరక్షణకు కృషి చేయాలి. గడచిన యాభయ్యేళ్ల కాలంలో చిత్తడి నేలల్లో సుమారు 60 శాతం మత్స్య సంపద, పక్షులు, క్షీరద సంతతి, సరీసృపాలు, ఉభయ చరాలు ఇప్పటికే అంతరించినట్లు పరిశోధనలు తెలుపు తున్నాయి. ఇకనైనా మేల్కొని, ఇంకా అంతరించి పోకుండా కాపాడుకోవడానికి ప్రభుత్వాలు చర్యలు చేపట్టాల్సి ఉంది.

# హిందీ వ్యాప్తికి మోటూరి సేవలు


Moturi Satyanarayana

మోటూరి సత్యనారాయణ హిందీ భాష ప్రచారానికి ఎనలేని సేవలు అందించిన విద్యావేత్త. భారత రాజ్యాంగాన్ని రూపొందించిన భారత రాజ్యాంగ సభలో సభ్యులు. 1966 వరకు రాజ్యసభ (భారత ప్రభుత్వ ఎగువ సభ) లో నామినేటెడ్ సభ్యులు. భారత రాజ్యాంగంలో హిందీని అధికారిక భాషగా మార్చడంలో ఆయన ముఖ్యపాత్ర పోషించారు. రాజభాష కమిషన్ సభ్యులుగా, స్వాతంత్ర్య సమర యోధులుగా, రాజ్యసభ సభ్యులుగా, హిందీ వికాస సమితి స్థాపకులుగా, హిందీ ప్రచార సభ ప్రధాన కార్యదర్శిగా, బహుభాషా వేత్తగా బహుముఖ సేవలు అందించిన ప్రతిభా శాలి. భారత ప్రభుత్వ పద్మశ్రీ, పద్మ భూషణ్ పురస్కార గ్రహీత. మోటూరి సత్యనారాయణ (ఫిబ్రవరి 2, 1902 – మార్చి 6, 1995) 1902, ఫిబ్రవరి 2 వ తేదీన కృష్ణా జిల్లా దొండపాడు గ్రామంలో పెద పిచ్చయ్య, రత్తమ్మ దంపతులకు జన్మించారు. ప్రాథమిక విద్య అనంతరం తెలుగు, సంస్కృతం అభ్యసించాడు. ఆంధ్ర జాతీయ కళాశాలలో ఉన్నతులైన గురువుల వద్ద శిక్షణ పొంది హిందీ బాగా అభ్యసించారు. తర్వాత ఇంగ్లీషు, తమిళం, కన్నడం, మలయాళం, మరాఠీ, గుజరాతీ, బెంగాలీ మొదలైన భాషలు కూడా నేర్చుకున్నారు. ఆయనకు రాజకీయ, సాహిత్య, సాంస్కృతిక, ఐతిహాసిక, వైజ్ఞానిక, సాంకేతిక విషయాలలో లోతుగా ప్రవేశం ఉండేది. అయన హిందీ ప్రచారంతో జీవితాన్ని ప్రారంభించి క్రమంగా సంఘటకులుగా, కార్యదర్శిగా, చివరకు 1938లో హిందీ ప్రచార సభకు ప్రధాన కార్యదర్శి అయి 1961 వరకు కొనసాగారు. ఆ సంస్థ ప్రథమ ప్రధాన కార్యదర్శి పండిత హరి హర శర్మకు కుడిభుజంగా ఉండి సహకరించారు. అయన దూరదృష్టి, అవగాహన వల్లనే ఈ సభ హిందీ సాహిత్య సమ్మేళనం, ప్రయాగవారి బంధనం నుండి విముక్తి పొంది 1927లో స్వతంత్ర సంస్థగా ఆవిర్భవించింది. మోటూరి ప్రధాన కార్యదర్శిగా ఉన్నంతకాలం దక్షిణ భారత హిందీ ప్రచార సభ చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖింప దగినది. 1936లో ప్రచారసభకు 4 రాష్ట్రాలలో, 4 ప్రాంతీయ శాఖల నిర్మాణం అయన దూరదృష్టిని నిరూపిస్తుంది. మోటూరి సత్య నారాయణ... మహాత్మాగాంధీ, రాజేంద్ర ప్రసాద్ లకు అత్యంత విశ్వాస పాత్రులు. 1946లో జరిగిన సభ రజతోత్సవానికి బాపూజీ 12 రోజులు ఉండి సమావేశాలు జరిపించారు. ప్రతి దినం గాంధీ ప్రార్థనా సమావేశాలలో వేలాది మంది పాల్గొనేవారు. మద్రాసు కార్పొరేషన్ నుండి త్యాగరాయ నగరంలో సుమారు ఐదున్నర ఎకరాల భూమిని సంపాదించి అప్పటి అవసరాల కనుగుణంగా భవనాలను నిర్మించారు. ముద్రణాలయం, పుస్తక ప్రచురణ, పరీక్షలు నిర్వహించడం ద్వారా ఆదాయం సమకూర్చారు. హిందీ ప్రచారాన్ని పెంపొందించడానికి ప్రతి రాష్ట్రంలోను, కొన్నిజిల్లాలలోను, మండలాల వారీగా సంరక్షకులను ఏర్పాటుచేసి నూతన ప్రణాళికల ద్వారా దక్షిణ భారతమంతా మారుమూలల వరకు హిందీని వ్యాపింప జేశారు. మోటూరి నేతృత్వ కృషి ప్రజలలో హిందీ పట్ల ప్రేమ, గౌరవం పెంచింది. 1942 లో క్విట్ ఇండియా ఉద్యమంలో జైలు శిక్ష అనుభవించారు. స్వాతంత్ర్య సమర యోధులుగా తామ్రపత్ర గ్రహీతలయ్యారు. రాజకీయ రంగంలో కూడా విలువైన సేవలు అందించారు. భారత రాజ్యాంగ చట్టంలో 17వ భాగం రాజభాష అధ్యాయ నిర్మాణంలోను, దాని డ్రాఫ్టింగ్, రాజ్యాంగ సభలో నెగ్గించడంలో అయన కృషి, సహకారం ఎంతో ఉన్నాయి. రాష్ట్రపతి ద్వారా 1954 నుండి 1966 వరకు వరుసగా రెండుసార్లు రాజ్యసభ సభ్యుడిగా నామినేట్ చేయబడ్డారు. 1956లో రాజభాషా కమిషన్ కు సభ్యులుగా పనిచేశారు. తెలుగు భాషా సమితి స్థాపక కార్యదర్శిగా "తెలుగు విజ్ఞాన సర్వస్వం" 16 భాగాలలో ప్రచురించారు. అదే విధంగా హిందీ వికాస సమితిని కూడా స్థాపించి హిందీలో "విశ్వవిజ్ఞాన సంహిత" పేరుతో హిందీ విజ్ఞాన సర్వస్వాలను ప్రచురింపచేశారు. ఆంధ్ర విశ్వ విద్యాలయం ఆయనను కళాప్రపూర్ణతో గౌరవిస్తే, కొన్ని విశ్వ విద్యాలయాలు గౌరవ డాక్టరేట్ తో సన్మానించాయి. భారత ప్రభుత్వం ఆయనకు పద్మశ్రీ (1958), పద్మభూషణ్ (1962) పురస్కారాల్ని ఇచ్చి గౌరవించింది. అయన సేవలను పురస్కరించుకుని హైదరాబాదులో రాష్ట్రపతి డాక్టర్ రాజేంద్ర ప్రసాద్ అధ్యక్షతన 1957లో పెద్ద ఎత్తున అభినందన సభ జరిపి అభినందన గ్రంథం సమర్పించారు. ఆయన 1995 సంవత్సరం మార్చి 6 వ తేదీన పరమపదించారు.

# రుతుసంబంధ వసంత పంచమి

వసంత పంచమి'గా పిలువబడే మాఘ శుద్ధ పంచమి ప్రధానంగా రుతు సంబంధ పర్వదినం. ఈదినమే చదువుల తల్లి "సరస్వతి జయంతి" గా కొన్నిచోట్ల భావించ బడుతుంది. దీనిని "సరస్వతి పూజా దినంగా, శ్రీపంచమి, మదన పంచమి, రతి కామ దమనోత్సవ పర్వదినం"గా పంచాంగ కర్తలు పరిగణిస్తారు. వసంత పంచమి నామాన్ని బట్టే దీనిని రుతు సంబంధమైనదిగా భావించవచ్చు. మకర సంక్రాంతి తరువాత ఉత్తరాయణం ప్రారంభం అవుతుంది. ఆకాలంలోనే క్రమంగా వసంత రుతు లక్షణాలైన చెట్లు చిగుర్చడం, పూలు పూయడం కనిపిస్తుంది. మాఘ మాసమే వసంత రుతువుకు ఆరంభమనే వాదనకూడా ఉంది. వసంతోత్సవారంభానికి వసంత పంచమినే కొందరు పంచాంగ కర్తలు ఉదహరిస్తారు. రాగల వసంత రుతువుకు శిశిరంలోనే స్వాగతించే పండుగ ఇది. ఈనాటి కృత్యాలలో నూతన వస్త్రధారణం, తైల స్నానాలు ప్రధానాలని చెప్పబడింది. నూతన వస్త్ర ధారులై, బుక్కా, వసంతం చల్లుకునే పండుగ అయినందునే వసంత పంచమి అని నామాంకితమైంది. "నవాన్న భక్షణ దినం"గా, సంక్రాంతికి వచ్చే ధాన్యాన్ని ఈ రోజు అన్నం వండి కులదేవతలకు నివేదించి తినే ప్రాచీన ఆచారమూ కొన్ని ప్రాంతాలలో ఉన్నది. ప్రాచీన కాలంలో "రోమనులు" కూడా "వసంత రుతు పండుగ"ను ఇదే రోజు, ఇదే మాదిరిగా చేస్తుండే వారని పేర్కొనబడింది. బ్రహ్మవైవర్త పురాణంలో.. ప్రకృతి ఖండంలో నాలుగో అధ్యాయంలో అన్ని శక్తులలో ప్రధానమైన శక్తిగల సరస్వతిని వసంత పంచమినాడు పూజించాలని చెప్పబడింది. కనుక వసంత పంచమి "విద్యారంభ దినం". జ్ఞానప్రాప్తి కోసం సరస్వతిని ఆరాధించమని బ్రహ్మవైవర్త పురాణం చెప్తోంది. విద్యకు అధిదేవతయైన సరస్వతిని మాఘ మాసమందు తాటియాకులు, గంటము, గ్రంథము లాది విద్యాసాధనములను దేవి ఎదుట ఉంచి, గంధ పుష్పాదులతో గ్రంథ రచన ప్రారంభ సమయంలో పూజించే ఆచారం ఉండినట్లు సురవరం ప్రతాపరెడ్డి పేర్కొన్నారు. "యాకుందేందు తుషార హార ధవళా యా శుభ్ర వస్త్రాన్వితా యా వీణావరదండ మండిత కరా యా శ్వేత పద్మాసనా, యా బ్రహ్మాచ్యుత శంకర ప్రభృతిభి దేవై సదా పూజితా, సామాంపాతు సరస్వతీ, భగవతీనిశ్శేష జడ్యా పహః" శ్లోక పఠనంతో పిల్లల చదువు ప్రారంభం అవుతుంది. సరస్వతీదేవి అహింసాదేవి. ఆయుధాలు ఏమీ ధరించని దేవత. తెల్లటి పద్మం మీద సరస్వతి నిల బడి ఉన్నట్లు, ఒక కాలు నిలువుగాను, మరొక కాలు దానిమీద అడ్డంగాను ఉంచుకుని, ఒక చేత వీణ మరొక చేత పుస్తకము ధరించి ఉన్నట్లు పద్మ పురాణ లిఖితం. తెల్లటి బట్టలు ధరించి, తెల్లటి పూలు, తెల్ల పూసల కంఠహారం, దానిపై తెల్లగంధం పూత తెల్లని వీణాపాణితో కూడిన ప్రశాంత, శాంతి దేవత సరస్వతి. పూజా సందర్భంలో చదువుకు, వ్రాతకు సంగీతానికి సంబంధించిన పరికరాలను ఆమె ముందుంచడం అనవాయితీ. సర్వవిద్యలకూ ఆధారమైన వాగ్దేవి చెంత పుస్తకాలు, కలాలు ఈ రోజున ఆరాధిస్తారు. "మాఘ శుక్ల పంచమ్యాం విద్యారంభే దినేపి చ పూర్వేహ్ని సమయం కృత్యా తత్రాహ్న సంయుతః రుచిః...'వసంత పంచమి రోజున ప్రాతఃకాలంలో సరస్వతీదేవిని పూజించి విద్యారంభం చేయాలని చెప్పబడింది.